# కథా - జీవితం

ఇందిర మనసు చాలా అశాంతిగా ఉంది. రాత్రంతా నమ్మకంగా నిద్ర పట్టలేదు. దాదాపు జాగారం అయింది. పాప చెప్పిన మాటలు విన్నప్పటి నుంచీ మనసు మనసులో లేదు. లలిత .... తనకన్నా ఎంతో చిన్నది! లలిత .... అంత గ్రంథకర్త అయిందా! పోనీ అది చిన్నదీ, లోకజ్ఞానం తెలియందీ అనుకుంటే, ఈయన వివేకం ఏమైపోయింది? ఆరేళ్ళుగా తనతో సహవాసం చేసి .... ఇద్దరు బిడ్డల్ని కని .... భగవంతుడా! .... ఇంతేనా అనురాగాలు! ఇంత అల్పమా జీవిత బాంధవ్యాలు!

"అక్కయ్యా! ఇంకా పత్రిక కుర్రాడు రాలేదా?" అంటూ లలిత వంటింట్లోంచి గబగబా వచ్చింది — "అరె! పదికూడా దాటింది. ఎక్కడో షైర్లుకొడుతున్నాడీ వెధవ!" అంది దురుసుగా.

ఇందిరకు మాట్లాడా లనిపించలేదు. అయినా అంది — "అతనే వస్తాడు. ఈ మాత్రానికే తిట్టటం ఎందుకూ?"

"తిట్టక ఏం చేస్తారేం? తొమ్మిదికల్లా ట్రైన్ వచ్చేస్తుంది. పదిగంటలకైనా పేపరు తెచ్చి చావకపోతే ...."

"మనకు పేపరిచ్చే భాగ్యానికి వాడెన్నిసార్లు చచ్చి బతుకుతాడు? లేటైతే రాగానే అడుగు, అదీ పద్ధతి. తిట్టడం ఎందుకూ?"

లలిత మాట్లాడకుండా మూతి ముడుచుకుని వంటింట్లోకి పోయింది.

ఇందిర లేచి కూర్చుంది. చాలా నీరసంగా వుంది. జ్వరం లేకపోయినా లేచి తిరగలేకపోతోంది. రోగిష్టి దానిలా తనింత నీరసపడి పోయిందేమిటి! చిక్కిపోయి .... గాజులు కూడా వదులైపోయి .... ఎప్పటిలాగా ఆరోగ్యం వస్తుందో లేదో!

"ఇంకా రాలేదా?" మళ్ళీ వచ్చింది లలిత విసుగ్గా చూస్తూ.

"ఎవరూ?"

"అదే. పేపరువాడు."

"రాలేదు. ఏం, ఎందుకంత కంగారు పడిపోతున్నావు? నీ రిజల్ట్సు గాని వస్తాయా?" ఆశ్చర్యంగా చూసింది ఇందిర.

"గాడిదగుడ్డు! రిజల్ట్సు వచ్చేదేమిటి? నేను ష్యూర్‌గా పాసౌతాను" అతిశయంగా అంది లలిత.

"అయితే మరెందుకీ కంగారూ?"

"వీక్లీ నిన్న రానేలేదు. ఇవ్వాళైనా తెస్తాడో లేదో! ఎక్కడో పెత్తనాలు చేస్తున్నాడు వీడు. వచ్చాక ఏదో నసుగుతాడు చూడు."

"చూద్దాంలేగానీ వీక్లీలో న్యూసేమిటి? ఏదైనా డిటెక్టివ్ కథ పడుతోందా?"

"కాదక్కయ్యా! కిందటివారం 'సుడిగుండం' కథ నువ్వు చదవలేదూ? భలే బావుంది కదూ? మంచి సస్పెన్స్‌లో పెట్టి 'సశేషం' అన్నాడు. చచ్చేకోపం వచ్చింది. సేల్స్‌కోసం నానా తిప్పలూ పడుతుంటారీ పత్రికలవాళ్ళు."

"కిటు కేమిటో తెలిసిపోయాక ఆ పత్రిక కొనక పోతేనేం?"

"అమ్మో! అసలే సస్పెన్స్‌తో వారం రోజులనించీ చస్తున్నాను. విసుగొచ్చేస్తోంది."

"అసలేమిటా కథ? కొంచెం చెప్పు. జ్ఞాపకం వస్తుందేమో!

"అదే అక్కయ్యా! వేణుగోపాల్ అనీ ఓ లెక్చరర్ వుంటాడూ .... పెళ్ళాం పేరు సావిత్రి. చదువూ సంధ్యా వుండవు. ఓసారి వాళ్ళిద్దరూ డాన్స్ ప్రోగ్రాం కెళ్ళి ...."

"ఆ డాన్సర్ తళుకూ బెళుకూ చూసి దాని వెన కాల పడతాడు కదూ? ఆ డాన్సర్ పేరేమిటి, మర్చిపోయాను."

"నళిని, సన్నగా తెల్లగా చాలా అందంగా వుంటుంది. వేణుగోపాల్ నళినిని మనసారా ప్రేమిస్తాడు."

ఇందిరకి ఒళ్ళు మండింది — "ప్రేమ! 'ప్రేమ' అంటే అసలు నీకు అర్థం తెలుసా? పైగా 'మనసారా' కూడానా? ఒకప్పుడు సావిత్రిని కూడా అలాగే ప్రేమించాడుగా?"

"సావిత్రిని ప్రేమించలేదక్కయ్యా! ప్రేమించానని భ్రమపడ్డాడంతే."

"అయితే ఇప్పుడు నళినినే నిజంగా ప్రేమిస్తున్నాడన్నమాట!"

"నువ్వు సైకాలజీ కూడా చదివావ్. ఎందుకంత హేళనగా మాట్లాడతావు?" ఉక్రోషంగా అంది లలిత. "అసలు, సావిత్రి, వేణుగోపాల్ ప్రేమ పొందడానికి ఎంతమాత్రం తగదు" అని లలిత కథలో మాటలే వల్లించింది.

"ఆ విషయం అతను పెళ్ళికి ముందే ఆలోచించుకోవలిసింది. ఇంతకీ ఇప్పుడు నళినిని ప్రేమించాడంటావా?"

"అదేమిటక్కయ్యా! చలం నీ కిష్టం కదా? అలా మాట్లాడతావేం? ఆకర్షణ అనేదే, ఎప్పుడెవరిమీద కలిగినా కలగొచ్చని చలం ఎన్నో కథలు రాశాడు కదా?"

ఇందిర మ్రాన్పడిపోయింది. చాలా మందికి చలం ఇలాగే అర్థమవుతాడేమో!

"ఊఁ, ఇంతకీ ఆ కథలో సస్పెన్సేం వుందీ?" అంది.

"అదే, చివరి కేమౌతుందో చదువుదామనీ."

"ఏమైతే బాగుంటుంది నీకు?"

"వేణుగోపాల్ నళినిని పెళ్ళి చేసుకుంటే బావుంటుంది కదా?"

"మరి సావిత్రి?" ఆశ్చర్యంగా అడిగింది ఇందిర.

"ఏ జబ్బో చేసి చచ్చిపోతే సరి."

అదిరిపడింది ఇందిర. గుండెలు దడదడా కొట్టుకున్నాయి. సాధ్యమైనంత తమాయించుకుంటూ చూసింది. "పాపం సావిత్రి ఎవరికేం అపకారం చేసిందే లలితా? ఆ అమ్మాయి చచ్చిపోవాలా?"

లలిత కాస్త కలవరపడింది — "అది కాదక్కయ్యా! నళిని కూడా వేణుగోపాల్ని గాఢంగా ప్రేమిస్తోందిగా?"

"సావిత్రి కంటేనా?"

"అసలు సావిత్రికి ప్రేమంటే ఏం తెలుసూ?"

ఇందిరకి ఎంత కోపం వచ్చిందంటే — లలిత తుళ్ళిపడేలాగ చెంపపెట్టు పెడదామనిపించింది. వెధవ్వాగుడు! .... మంచం మీదనించి లేచే ఓపికే లేదు.

అక్కగారి మౌనంచూసి లలిత అంది "నువ్విలా అంటున్నావుగానీ, అసలు రచయిత, వేణుగోపాల్నెంత సపోర్ట్ చేస్తున్నాడో చదివావుగా? రీడర్స్‌కి నళిని మీదా గోపాల్‌మీదా సింపతీ వచ్చేలాగ ...."

"ఇప్పుడలాగే అనిపిస్తుంది. తర్వాత వేణుగోపాలే పశ్చాత్తాప పడతాడేమో! కథలో ఏదో ట్విస్ట్ వుంటుంది. ఒకవేళ నువ్వు అన్నట్టే కథ ముగిస్తే, రైటరు తప్పతాగి కూర్చుని జోగుతూ రాశాడని నేను పందెం వేస్తాను" అంది ఇందిర ఆవేశంగా, అంత నీరసంలోనూ.

కూర మాడువాసన ఎప్పటినుంచో! "అయ్యయ్యో, మర్చేపోయాను" అంటూ వంటింట్లోకి పరిగెత్తింది లలిత.

ఇందిర వెర్రిదానిలా చూస్తూ కూర్చుంది ఎంతోసేపు. లలిత చెప్పే కథకీ, తన సంసారానికీ చాలా పోలికవుంది. సాక్షాత్తూ తన మొగుడే వేణుగోపాల్‌లా తయారౌతున్నాడు. నిమ్మకు నీరెత్తినట్టు తనెందుకింత ముభావంగా వుంటోంది?

పేపరు పడింది కిటికీలోంచి.

అడక్కుండానే చెప్పాడా అబ్బాయి — "ఇవ్వాళ బండి చాలా లేటమ్మా! వీక్లీకూడా రాలేదు. రేపొచ్చేస్తుందిలెండి" హడావుడిగా సైకిల్ ఎక్కి వెళ్ళిపోయాడు.

ఇందిర మనసు కొంచెం తేలికపడింది. లేచి పేపరు తీసి టేబిల్‌మీద పెట్టింది. వంటింట్లోకి వెళ్ళి మాడినకూర తీరుతెన్నులు చూద్దామనుకుంది. వెళ్ళబుద్ధి కాలేదు. మందు తాగి నీరసంగా మంచం మీద పడుకుంది.

★ ★ ★

నెలరోజుల కిందట ....

ఇందిరకి, తలపోటుతో ప్రారంభమైంది జ్వరం. రెండు రోజులెలాగో తినీ తినకా ఇంట్లో పనులు చేసుకుంది. ఇంకో రెండు రోజులు ఆఫీసుకు సెలవుపెట్టి నానా హైరానా పడ్డాడు ప్రకాశం. దగ్గిర కూర్చుని చెప్పి చేయించే ఓపికకూడా లేదు ఇందిరకి. వంటమాటెలా ఉన్నా పిల్లల్ని చూడటం చెడ్డ విసుగ్గా ఉంది ప్రకాశానికి. చంటివాడికి తోక ఒకటే తక్కువ. తినేసి దొడ్డికి పరిగెత్తడం తప్పితే ఇంకో ఉద్యోగం లేదు వాడికి. వాడి

సేవతో కంగారెత్తిపోయాడు ప్రకాశం.

"ఇందిరా! మీ అమ్మగార్ని అర్జంటుగా రమ్మని వైరిచ్చేస్తాను" అన్నాడు గరిటె అవతల పారేసి బట్టలు వేసుకుంటూ.

ఇందిర లేచి కూర్చుంది — "మా అమ్మ అయితే వారం రోజులైనా వుండకుండా, 'వెళ్తాను, వెళ్తాన'ని కూర్చుంటుంది. పోనీ లలితకి సెలవలేగా? ఎప్పుడూ రాలేదు కూడాను. దాన్ని పంపించమని రాయండి" అంది.

"ఇది మరీ బాగుంది. నీ చెల్లెలు రావడం కాస్త పనీ పాటా చెయ్యటానికా, సినిమాలవీ చూడ్డానికా?"

"ఫర్వాలేదు, లలితకి .... అన్నీవచ్చు. దాని దగ్గర పిల్లలకికూడా అలవాటే."

"సరే! అయితే" — తీరా బయల్దేరబోతూ వెనక్కి తగ్గి — "అసలు లలితని పంపిస్తారా మీ వాళ్ళు?" అన్నాడు ప్రకాశం సందేహిస్తూ.

"ఏం? ఎందుకు పంపించరు?" కళ్ళువిప్పి ఆశ్చ ర్యంగా చూసింది ఇందిర.

"ఏమోలే! పెద్దవాళ్ళ కన్నీ ఎక్కడలేని అను మానాలు."

"అసలు వాళ్ళకు లేని అనుమానాలన్నీ మీకే."

ప్రకాశం మరేమీ అనకుండా వెళ్ళిపోయాడు.

మర్నాడు సాయంత్రం వేళ వచ్చింది లలిత.

సాక్షాత్తూ దేవతలా కన్పించింది ఇందిరకి "వచ్చావా తల్లీ? అబ్బ! జ్వరంతో నేను మంచం ఎక్కితే .... ఇల్లు చూడు .... ఎలా వుందో! అదిగో! చంటివెధవ రాగం .... వంటింట్లో స్టౌ వుంది. బల్లమీద పాలున్నాయి కొంచెం వెచ్చబెట్టి ముందు వాడికిచ్చేయ్. లేకపోతే ఒకళ్ళ మాటలు వొకళ్ళకి విన్పించవు. వెళ్ళు ముందు" అంటూ చెల్లెలికి పని పురమాయించింది.

లలిత, కార్యరంగంలోకి దూకుతున్నట్టు — పైట కొంగు నడుం చుట్టూ బిగించింది — "రారా గాడిదా! ఎందుకలా అరుస్తావ్ ఇంజన్‌లాగా?" అంటూ వాణ్ణి బరబరా లాక్కుపోయింది. మరో పావుగంటకి కానీ వాడి రాగం కట్టలేదు. నీళ్ళుపోసి ఉతికిన చొక్కా తొడిగి తీసుకొచ్చింది.

"వీడు నా దగ్గిర కూర్చుంటాడుగానీ, రెండు డబ్బాలు బియ్యం కొలిచి అన్నం వండు. పొద్దుటి కూరలేవో వున్నాయిలే. ఫర్వాలేదు. నీ స్నానం అయ్యాక మళ్ళీ వేడినీళ్ళు పడేయ్" ఓపిక తెచ్చు కుంటూ చెప్పింది ఇందిర.

"బావగా రెప్పుడొస్తారు?"

"వచ్చేస్తారు. ఈ జ్వరం వచ్చిన దగ్గిర్నించీ పెంద లాడే వస్తున్నారు. ఫ్లాస్కులో కాఫీ పోసి వుంచు. అన్నట్టు సుజీ ఆడుకోడానికి పోయింది. రాగానే నీళ్ళు పొయ్యి."

"సరేలే. నువ్వు పడుకో. అన్నీ నే చేస్తాలే" అంటూ హుషారుగా వంటింట్లో కెళ్ళిపోయింది లలిత. కూని రాగాలు తీస్తూ పని ప్రారంభించింది. డబ్బాలూ తట్టలూ బుట్టలూ అన్నీ సర్దింది. గదులు శుభ్రంగా ఊడ్చింది. బండెడు విడిచిన గుడ్డలు నాన బెట్టింది. స్టౌ అంటించి ఎసరు పడేసింది.

ప్రకాశం ఇంటికి వచ్చాడు. ఇందిర మొహం కళ కళ్ళాడుతూ కన్పించింది — "లలిత వచ్చింది" అంది శుభవార్త చెప్తున్నట్టు.

"వచ్చేసిందా? గడుసు పిండమే. స్టేషన్‌కెళ్దామను కున్నానుగానీ ఆఫీసులో వీలుకాలేదు. సరేలే! కాలేజీ పిల్ల .... ఆ మాత్రం నోట్లో నాలిక వుండదా అని వూరుకున్నా."

"నాలికేం ఖర్మ, పళ్ళు కూడా వున్నాయి. జ్ఞాపకం పెట్టుకోండి" నవ్వుతూ అంది ఇందిర.

"నాన్నా, నాన్నా! పిన్ని వచ్చింది, పిన్ని" అంటూ చెయ్యి పట్టుకు లాగింది సుజీ.

"పదరా, మీ పిన్నిని చూద్దాం" అంటూ కొడుకుని ఎత్తుకుని వంటింట్లోకి బయల్దేరాడు ప్రకాశం. సుజీ అంతకుముందే పరిగెత్తింది.

కూనిరాగాలు తీస్తోన్న లలిత టక్కున ఆపేసి సిగ్గు పడుతూ మొహం తిప్పుకుని నించుంది. బావగారు తెలిసిన వాడే. అయినా ఎప్పటికప్పుడే కొత్తా! సిగ్గూ!

"చూడు పిల్లా! పనీ అదీ చేసుకోగానీ, పాటలు పాడకు. ఇంట్లో పేషెంటూ, ఇద్దరు చంటివాళ్ళూ, పాపం పారిపోలేదు చూడూ"

వెనకాలే వచ్చిన ఇందిర నవ్వింది — "చాల్లెండి. అసలే సిగ్గుపడుతోంది అది. అయినా లలిత ఎంత బాగా పాడుతుందో తెలుసా?" అంది.

ప్రకాశం కాఫీ తాగి నాలుగు రోజుల నించీ మొహం వాచివున్న రోడ్ల కొలతలకి బయల్దేరాడు.

"కొంచెం తొందరగా వచ్చెయ్యండి. అర్ధరాత్రి వరకూ మీ కోసం లలిత కూర్చోలేదు. నే నసలే వుండ లేను" అంటూ హెచ్చరించింది ఇందిర.

ఎనిమిది గంటలకల్లా లలిత బట్టలన్నీ వుతికేసి, పిల్లలకి అన్నాలు పెట్టేసి, పనులన్నీ ముగించేసి, వచ్చింది. ఇల్లు ఓ కొలిక్కి వచ్చినట్టయింది.

"లలితా! రెండు రోజుల్నించి తల దువ్వుకోలేదే. కాస్త చిక్కుతీద్దూ!" అంది ఇందిర నెమ్మదిగా లేచి కూర్చుంటూ.

లలిత, అక్కగారికి తలదువ్వుతూ, చిక్కులు విప్పుతూ కూర్చుంది. పుట్టింటి కబుర్లన్నీ మహోత్సాహంగా చెప్పుకుపోతోంది.

"అబ్బ! ఏమిటే? కొత్త చిక్కులు వేస్తున్నావూ. నెమ్మదిగా దువ్వు."

"లేదక్కయ్యా! నెమ్మదిగానే తీస్తున్నాను."

ప్రకాశం తొమ్మిదిన్నరకి వచ్చాడు. "చాలా తొంద రగా వచ్చేశాను కదూ?" అన్నాడు.

"అంతే లెండి" అంది ఇందిర నవ్వి.

బజారునించి వచ్చిన కూరలన్నీ సర్దింది లలిత.

ప్రకాశం స్నానానికి వెళ్ళాడు

"లలితా! బావకి అన్నం పెట్టు" అంది ఇందిర పడుకుంటూ.

"అన్నీ అక్కడ పెట్టేస్తాగానీ నేను దగ్గిర కూర్చోను బాబూ!" అంటూ వెళ్ళింది లలిత. పీటవేసి అన్నం పెట్టేసి, పళ్ళెంమీద మూతపెట్టి, మళ్ళీ గదిలోకొచ్చి కూర్చుంది.

ప్రకాశం మజ్జిగ పోసుకుంటూ "ఇందిరా! ఉప్పు కావాలి" అని అరిచాడు.

ఇందిర లలితకేసి చూసింది "వెళ్ళిచూడు. పరాయివాళ్ళా ఏమిటి, అంత సిగ్గు పడ్డానికి?" అని మందలించింది.

వంటింట్లోకి వెళ్ళింది లలిత. బావగారి పళ్ళెంలో ఉప్పు వేసి తలుపు నానుకొని నించుంది.

ప్రకాశం తల ఎత్తి చొరవగా చూశాడు "చిన్నప్పుడు నా దగ్గిర ఎన్ని డబ్బులు తీసుకునే దానివో! అప్పుడే మర్చిపోయావా?" అన్నాడు నవ్వుతూ.

లలిత సిగ్గుతో మాట్లాడలేదు.

ఇందిర పెళ్ళినాటికి లలిత పన్నెండేళ్ళది. పరికిణీలు కట్టుకుని తిరిగేది.

ప్రకాశం లలితని ఆశ్చర్యంగా చూశాడు మళ్ళీ మళ్ళీ. అబ్బ! ఆరేళ్ళలో ఎంత మార్పు! మిసమిస లాడుతూ .... తెల్లగా .... ఎత్తుగా .... పెద్ద పెద్ద కళ్ళూ .... బారెడు జడా .... చాలా మంది ఆడవాళ్ళు కథల్లో కన్నా వెయ్యేసి రెట్లు అందంగా వుంటారు!

"లలితకు చాలా సిగ్గు" అన్నాడు ప్రకాశం గదిలో కొస్తూ.

నిద్రరాని కళ్ళతో నీరసంగా చూస్తూ ఇందిర "ఆం, సిగ్గే. రెండు రోజులు పోనివ్వండి. ఎలా వాగుతుందో!" అంది నవ్వుతూ.

★ ★ ★

మర్నాడు కాఫీల వేళ లలిత కాస్త సిగ్గు వదిలించు కుని మాట్లాడింది బావగారితో.

"పరీక్ష లెలా రాశావు?" అన్నాడు.

"బాగానే రాశాను."

"క్లాసు వస్తుందా?"

"ఏమో! నాకేం జోతిష్యం తెలుసా?"

"అబ్బో! జాతక చక్రాలమీద ఆధారపడి వుందా నీ పరీక్ష?" అని నవ్వాడు బావగారు.

కాఫీ తాగుతూ ఇందిర దగ్గిరికి వెళ్ళాడు.

"ఎలా వుంది ఇందిరా?"

"టెంపరేచర్ ఎక్కువైనట్టుంది. నిన్నట్లా లేదు" నీరసంగా అంది ఇందిర.

"లేచి కొంచెం మొహం కడుక్కుని మందు వేసుకో. డాక్టర్ గారికి చెప్పి వెళ్తాను. మందు మారిస్తే సాయంత్రం చూద్దాం."

ఇందిర ఓపిక తెచ్చుకుని లేచి కూర్చుంది. మొక్కు తీర్చుకున్నట్టు మందు మింగి మళ్ళీ పడుకుంది. ఆ పడుకోవటం పడుకోవటం వారం రోజుల వరకూ మూసిన కన్ను తెరవకుండా పడుకుంది. టైఫాయిడ్ అని తేల్చాడు డాక్టరు. టెంపరేచర్ తగ్గినట్టే తగ్గి హెచ్చుతూ, పత్యం ప్రసక్తి ఏ రోజు కా రోజే వాయిదా పడుతూ వచ్చింది.

మొత్తంగా జ్వరం తగ్గింది. రోజంతా రాలేదు.

"అసలు తిండిలేదన్న బెంగకన్నా తలా ఒళ్ళూ మాసి కంపరం పుడుతోంది" అంటూ విసుక్కుంది ఇందిర — "లలితా! వేన్నీళ్ళు పెడుదూ, తల రుద్దేసు కుంటాను. తేలిగ్గానే వుంది" అంది లేస్తూనే.

"జ్వరం తగ్గిందో లేదో అప్పుడే తల రుద్దు కుంటావా? భలే దానివే!" ప్రకాశం కోపంగా అన్నాడు.

"నా బాధ మీకేం తెలుసు? చిరాకుతో చచ్చి పోతున్నాను. మనిషి దగ్గిర ఇంత వాసన వస్తే డాక్టరు గారు మాత్రం ఏమనుకుంటారు?"

"తల రుద్దుకో లేదనుకుంటారా?" అని నవ్వాడు.

ఇందిరకి ఉక్రోషం వచ్చింది. "అవును. మీకు నవ్వులాటలాగే వుంటుంది. నేను మాత్రం తలంటు కోడం మానను. లలితా! వెళ్ళు, పొయ్యి అంటించు. నీక్కాదూ చెప్పేది?" అంటూ కోపంగా చూసింది చెల్లెల్ని.

లలిత బావగారికేసి చూసింది.

ప్రకాశం లలితని వెళ్ళిపొమ్మని సైగ చేశాడు. ఇందిర దగ్గిర కూర్చున్నాడు. "సరే! తలంటుకుంటా వనుకో, ఏమన్నా అయితే?"

"ఏమౌతుందీ?"

"ఏదో అవుతుంది. ఇప్పుడు తెలుస్తుందా?"

"పోనీ అయితే అవుతుంది. మీకేం?"

"చాల్లే! పిచ్చిదానిలా మాట్లాడకు" అంటూ లేచాడు— "నువ్వు తలంటుకున్నావంటే, నేను అన్నం తినను."

"పోనీ మానండి, నాకేం?"

"ఛీ! పెంకిఘటం!" విసురుగా బయటికి వెళ్ళిపో యాడు— "నీ ఇష్టం వచ్చినట్లు చేసుకో" అని అరిచి.

ఇందిర తిరిగ్గా పడుకుంది .... ప్రకాశం కోపం చూస్తే నవ్వొచ్చింది. తనకేమైనా అయితే ఆరాటపడే భర్త .... తనకి చాలా సీరియస్ అయినప్పుడు .... దగ్గిర కూర్చుని దిగులుగా భయంగా చూస్తోంటే ఎంత తృప్తిగా వుంటుందో!

ఇందిర జ్వరం ధర్మమా అని లలిత సిగ్గు వదిలి పోయింది. నవ్వుతూ పేల్తూ సుబ్బరంగా మాట్లాడే స్తోంది, బావగారితో.

మంచం ఎక్కాక పది రోజుల్లో ఇందిర పత్యం తింది బీరకాయ కూరతో. తలంటుకుంది. నిద్ర పోకుండా పుస్తకాలేవో తిరగేస్తూ కూర్చుంది.

వరండాలో — ప్రకాశం, లలితా, పిల్లల గంతులు చూస్తూ, పగలబడి నవ్వుతూ, చప్పట్లు కొడుతూ, పిల్లలకంటే ఎక్కువ అల్లరి చేస్తున్నారు.

ఇందిరకి మందుమాట జ్ఞాపకం వచ్చింది. "లలితా!" అని పిల్చింది రెండు మూడుసార్లు. "సుజా!" అంది ఇంకో రెండుసార్లు. వాళ్ళ నవ్వుల లోకంలో ఇందిర కీచు కేకలు జొరబడనేలేదు. ఇంది రకు చిరాకేసింది. లేచి వెళ్ళి నీళ్ళు తెచ్చుకుని మందు వేసుకుంది.

లలిత నవ్వుతోందో మాట్లాడుతోందో తెలీకుండా నవ్వుతూ మాట్లాడుతోంది.

ఇందిర లేచి వెళ్ళింది. ప్రకాశం, లలితా ఇల స్ట్రేటెడ్ వీక్లీలో కొత్తగా పెళ్ళయిన వాళ్ళ ఫొటోలు చూస్తున్నారు.

"బావా! ఈ అబ్బాయి గెడకర్రలా వున్నాడుకదూ? చూడు, ఈ అమ్మాయి ఎంత బొండాంలా వుందో! .... ఇదిగో .... ఈ చివర ఫొటోలో అమ్మాయైతే వీడికి సరి పోయింది. బాహోయ్! ఆ బొండానికి ఇక్కడో బొండాం వున్నాడు" అంటూ జంటల్ని విడదీసి సన్నటి వాళ్ళకి సన్నటి వాళ్ళనీ .... లావు వాళ్ళకి లావు వాళ్ళనీ జతలు చేసి చెప్పుకుంటూ నవ్వులతో పగలబడిపోతున్నారు.

చూస్తున్నకొద్దీ ఇందిరకి అసహ్యం వేసింది. లలిత చిన్నప్పట్నుంచీ చలాకీ అయిందేగానీ — కాలేజీలో చేరింతర్వాతే ఇలాంటి వెధవ అల్లరి నేర్చినట్టుంది. మరీ చిన్నదా, చితకదా? అయినా ఈ పెద్ద మనిషికైనా ఇంగితం వుండద్దూ?

"దానికి బుద్ధిలేకపోతే మీకైనా వుండద్దూ?" విసురుగా అంది అనాలనే.

"ఏమిటి?" అన్నాడు ప్రకాశం నొసలు చిట్లిస్తూ.

"వాళ్ళందరూ చక్కగా పెళ్ళిళ్ళు చేసుకుని ఫొటోలు తీయించుకుంటే వాళ్ళ ఈడూ జోడూ ప్రసక్తి మీకెందుకూ?"

"ఏదో సరదాకి .... ఊరికే ...."

"అదేం సరదా? పిచ్చిసరదా!" చిరాగ్గా అనేసి గది లోకి వెళ్ళిపోయింది ఇందిర. సరదా అట, సరదా! వెధవ సరదా! ఏ జోక్సో చదువు కోవచ్చుగా? ఏ కార్టూన్సో చూసుకోవచ్చుగా?

అక్కగారు వెళ్ళిపోయాక లలిత కిక్కురుమన కుండా కూర్చుంది బుద్ధిగా పుస్తకం తిరగేస్తూ.

★ ★ ★

ప్రకాశం బజారుకి బయల్దేరుతోంటే లలిత గబగబా పరిగెత్తుకొచ్చి చెప్పింది "బావా! ఇవ్వాళ తొందరగా వచ్చెయ్! కల్పలత వుంది. సరదాగా విందాం."

"వచ్చేస్తాలే" అంటూ సైకిలెక్కాడు ప్రకాశం.

ఇందిరకి ఆశ్చర్యం వేసింది. బావా మరదలూ కలిసి వినాలా పాటలు? ఎలా వుంటుందో ఆ సరదా? .... అన్నారేగానీ ఈయనగారు పెందలాడే రావటం కూడానా?

బావ మీద లలితకి వున్న నమ్మకం భర్తమీద ఇంది రకి లేదు. వార్తలు కూడా అవకుండానే వచ్చేశాడు ప్రకాశం.

"ఏమిటివ్వాళ? అప్పుడే గుర్తువచ్చింది ఇల్లు?" నవ్వుతూ అంది ఇందిర.

"ఇంటికి తొందరగా రావటం నేరం కాదుగా?" అంటూ తనూ నవ్వి స్నానానికి వెళ్ళాడు.

తీరా రేడియోలో కల్పలత ప్రారంభమైతేగానీ ప్రకాశం అంత తొందరగా ఇంటికొచ్చిన కారణం స్ఫురించలేదు ఇందిరకి.

రేడియో పెట్టారు.

ఇందిర మడత కుర్చీలో వెనక్కు వాలి పడు కుంది.

లలితా, ప్రకాశం, సుజాతా రేడియో చుట్టూ కుర్చీలు వేసుకుని కూర్చున్నారు. రేడియో పెట్టారేగానీ ఒక్కళ్ళూ పాటలు వినటంలేదు. ఆ సినిమాల కబుర్లూ నవ్వులూ ....!

"చిటపట చినుకులు పడుతూ వుంటే
చెలికాడే సరసన వుంటే ...."

"అబ్బా! ఈపాట నాకు భలే ఇష్టం!" అంటూ ఎగిరి గంతేసినంతపని చేసింది లలిత — "షూటింగు అయ్యేవరకూ వాళ్ళు వర్షంలో నడుస్తోనే వుంటారు కదూ బావా? ఓసారి మా ఫ్రెండూ వాళ్ళు మద్రాసు వెళ్ళారట ...."

"ఎదటన వున్నది మనమిద్దరమే
అనుకుని హత్తుకు పోతోవుంటే
చెప్పలేని ఆ హాయీ ఎంతో ...."

ప్రకాశం లలితకేసి చిలిపిగా చూస్తూ నవ్వాడు "లలితా! ఆ హాయి నీకు తెలుసా?"

"ఛీ! పో బావా!" అంది లలిత కోపం నటిస్తూ. నిజంగా లలిత 'నటిస్తోంద'నే అన్పించింది ఇందిరకి చెల్లెలి ధోరణి చూస్తే.

ప్రకాశం మళ్ళీ అన్నాడు — "పోనీ మీ అక్క నడుగు."

ఇందిరకి ఒళ్ళు చచ్చిపోయింది. "ఛీ! ఏం మాటలు మీరు చిన్నపిల్లతో ...." అంది మొహం చిట్లిస్తూ.

"చిన్నపిల్లా? .... ఇంకా చిన్నపిల్లేనా?" అని నవ్వాడు.

"అందాల చేతులు కందేను పాపం — వస్తుం దిప్పుడు చూడు బావా! పందెం" అంది లలిత ధీమాగా.

"రాదు. పందెం" అన్నాడు ప్రకాశం పోటీగా.

"హరి రిహ ముగ్ధ వధూనికరే!" ప్రారంభమైంది.

"భగవాన్! రక్షించు! రక్షించు!" అంటూ చెవులు మూసేసుకుంది లలిత. "బాబోయ్! ఈపాట నేను వినలేను" అంటూ ఆక్రోశించింది. పాట వస్తున్నంత సేపూ చెవులు మూసుకునే వుంది. అయినా పాట వినపడుతూనే వున్నట్టు మొహం చిట్లిస్తూనే వుంది. కాస్సేపటికి అమాయకంగా మొహంపెట్టి — "ఆ పాట అయిపోయిందా బావా?" అంది.

"అయిపోయింది" అన్నాడు ప్రకాశం మధ్యలోనే.

లలిత చెవుల మీదనించి చేతులు తీసేసి సిని మాల్లోలాగా కెవ్వుమని అరుస్తూ మళ్ళీ మూసేసు కుంది — "ఛీ! ఫో బావా! అన్నీ అబద్ధాలే" అంది చురచురా చూస్తూ.

ఆ పాట నిజంగానే అయిపోయింది — "వరించి వచ్చిన మానవ వీరుడు ...." ప్రారంభమైంది.

"బావా, ఆ హరి రిహం ఇంకా అయిపోలేదా?" అంది విసుగ్గా మొహంపెట్టి లలిత.

"లేదు, మళ్ళీ నన్ను తిడతావు" అన్నాడు ప్రకాశం. మళ్ళీ వెంటనే లలిత మీద పడి, చెవుల మీదనించి రెండు చేతులూ తీసేశాడు.

లలిత కెవ్వున అరుస్తూ బావగారి చేతులతో పెనుగులాడింది. కొత్తపాట వింటూ — "చెప్పలేదేం బావా? ఈ పాట నాకెంత ఇష్టమో! ఈ పిక్చర్ సిక్స్ టైమ్స్ చూశా" అంది.

"ఇదే కాబోలు సరదాగా పాటలు వినటం అంటే" అంది ఇందిర విసుక్కుంటూ. ఏడెనిమిదేళ్ళ పిల్లలు అల్లరి చేసినట్టు, పద్దెనిమిదేళ్ళ మనిషి అదేం అల్లరీ! ఇంకా కూర్చోబుద్ధి కాలేదు.

"రేడియో కట్టిపారేసి కబుర్లే చెప్పుకోరాదూ?" అందిలేస్తూ.

"ఏం, వెళ్ళిపోతున్నావేంటీ?" అన్నాడు ప్రకాశం.

"తలనెప్పిగా వుంది. పడుకుంటా" అంటూ గదిలో కెళ్ళిపోయింది ఇందిర.

లలిత అల్లరీ నవ్వులూ ఇంకా ఎక్కువయ్యాయి.

అక్కడ తను కూర్చున్నంతసేపూ తను వున్నట్టే ప్రవర్తించలేదు వాళ్ళు. ఆ వేళాకోళాలూ .... ఒకళ్ళ నొకళ్ళు తోసుకోడాలూ .... గిల్లుకోడాలూ .... ఛీ!

ఛ, తను పిచ్చిగా ఆలోచించటం లేదుకదా? లలిత మొదటి నించీ చిలిపిదే. ఇక ఈయనా? తను మాట్లాడకుండా నీరసంగా కూర్చుంటే మరదలతో ఏదో కాలక్షేపం. పిల్లలగోల వుండనే వుంది. — ఇందిర ఎటూ ఆలోచించలేక కళ్ళు మూసుకుని పడుకుంది.

కల్పలత అయిపోయింది. ఎవరో ఆలాపన ప్రారంభిస్తోంటే టక్కున ఆ విద్వాంసుడి గొంతు నొక్కేశారు.

"బతికాం బాబూ!" అంది లలిత ఆపదలోంచి బతికి బయటపడ్డట్టు.

"అన్నట్టు నువ్వేదో చాలా బాగా పాడతావంటగా, మీ అక్క చెప్పింది. విందాం, ఓపాట పాడుదూ" అన్నాడు ప్రకాశం.

"అక్కయ్యా, పిల్లలూ నిద్రపోతున్నారు. ఎటొచ్చీ పరగెత్తాల్సిన వాడివి నువ్వే. ఈ రాత్రివేళ .... ఏ మోకాళ్ళో బద్దలు కొట్టుకుంటావు" అంది లలిత పకపక నవ్వుతూ.

"నాకు నచ్చకపోతే. నీ నోరు మూసేస్తానుగానీ పాడుదూ ...."

"ఏం పాడను? నాకు సంగీతం రాదు. చిన్నప్పుడు మా బళ్ళో 'వరవీణా, మృదుపాణీ' వరకే చెప్పారు. అది అప్పుడే పోయింది. సినిమా పాటలు పాడనా?" అని, 'నా మాట నమ్మితివేలా' ప్రారంభించింది. పాటంతా విన్నాడు ప్రకాశం. రెండు మూడు పాటలు అడిగి పాడించుకున్నాడు. చక్కగానే పాడింది లలిత. తీగలా మృదువుగా తేలిగ్గా సాగుతోంది కంఠం. పాడటంకూడా నేర్పుగానే వుంది.

ప్రకాశం ఆశ్చర్యపోతూ "చాలా బాగుంది లలితా నీకంఠం, నిజం."

"అందుకేనా నోరు ముయ్యలేదు?"

వాళ్ళిద్దరూ మాట్లాడుకుంటూనే వున్నారు.

ఇందిరకు నిద్రపట్టేసింది.

★ ★ ★

లలితవచ్చి రెండు వారాలపైనే అయింది. అక్కగారి జ్వరం గొడవలోపడి అన్నాళ్ళూ సినిమా పేరెత్తకుండా ఓపిక పట్టింది.

"బావా! ఇవ్వాళేదైనా పిక్చర్ కెళ్దామా?" అంది ఆత్రుతగా.

"ఏం పిక్చరు?"

"ఏదో ఒకటి" — ఇంట్లోంచి బయటపడితే చాలన్నట్టుంది లలితకి.

"అలాగే వెళ్దాంలే" అన్నాడు ప్రకాశం.

"వెళ్దాంలే — కాదు. నువ్వు తొందరగా రావాలి."

"అరె! కట్టుకున్న పెళ్ళాంకూడా నాకిలా ఆర్డర్స్ వెయ్యలేదే!"

"అయితే వద్దులే. నే నసలు సినిమాకే రాను" అంటూ మూతి ముడుచుకుని వంటింట్లోకి పోయింది లలిత.

"అరెరె, లలితా! లలితా!" అంటూ వెంటపడ్డాడు ప్రకాశం.

లలిత జడ దొరక బుచ్చుకున్నాడు. నడుం మీద చెయ్యేశాడు. "చెప్పు, కోపంపోయిందా? పోయిందా?"

ఇందిర గదిలోంచి బయటికి వచ్చింది "ఏమిటి?" అంటూ.

ప్రకాశం తడబడ్డాడు. "లలిత పిక్చర్ కెళ్దామని సరదాపడుతోంది. అలాగేలే అన్నా" అంటూ వంటింట్లోంచి గబగబా బయటికి వెళ్ళిపోయాడు.

ఇందిర మాట్లాడ లేకపోయింది. అలాంటి

దృశ్యాలు అప్పుడప్పుడూ చూస్తోనే వుంది. అసలీ మధ్య లలిత తన ఎదట మసలటమే మానేసింది. మధ్యాన్నంపూట తన దగ్గిరే కూర్చుని చదువుకునేది. ఇప్పుడు అదేం లేదు. ఎంతో అవసరమైతే తప్ప దగ్గిరకే రావటంలేదు. సినిమాకి వెళ్తానని ముందు తనతో చెప్పకూడదూ! అది అడిగితే మాత్రం? 'లలిత ఇలా అంటోంది' అని ఈయన తనతో చెప్పొద్దూ?

"పోనీ తీసికెళ్ళండి, దాని కస్తమానూ సినిమాలు చూడటం అలవాటు" అంది ముభావంగా.

సాయంత్రం నాలుగ్గంటలకల్లా వంటాగింటా అవగొట్టేసింది లలిత. పిల్లల్ని తయారు చేసింది. తను ముస్తాబుకి కూర్చుంది.

"లలితా! రెడీయేనా?" అంటూ వచ్చాడు ప్రకాశం, వీధిలోంచే. ఎంత జ్ఞాపకం!

"ఓ! నీదే ఆలశ్యం!" అంటూ బయటికి వచ్చింది లలిత. ప్రకాశం కొత్తగా చూస్తోన్నట్టు చూశాడు లలితని! ఎర్రటి బార్డర్ పరికిణీమీద తెల్లటి టెర్లిన్ ఓణీ వేసుకుంది. ఒంటిపొర పైటమీదకి పెద్ద లాకెట్ చెయిన్ వేళ్ళాడుతోంది. రెండు జడలూ రిబ్బన్లు లేకుండా వదిలేసింది. చెవుల రింగులు చెంపలకి తగిలేలా తమాషాగా తలవూగిస్తూ కాఫీ తెచ్చింది.

"తీసుకో బావా తొందరగా."

ప్రకాశం ఒళ్ళు తెలుసుకుని కాఫీ తాగాడు.

"ఇందిరా! మేము వెళ్తున్నాం" అన్నాడు దూరంగా వరండాలోంచి. లలిత హైహీల్స్ బిగించుకుంది.

ఇందిర బయటి కొచ్చింది. "ఇప్పట్నుంచీనా? గంటపైగా వుంది టైము."

"అలా షాపులన్నీ చూసుకుంటూ వెళ్తాం."

"బాబుని ఉంచెయ్ లలితా! వాడెందుకూ?" అంది ఇందిర.

"ఫర్వాలేదులే. నిన్నసలే విసిగిస్తాడు. సుజా నడుస్తుందిగా? బాబుని నేనెత్తుకుంటాను" అన్నాడు ప్రకాశం! అబ్బ! ప్రకాశానికి ఎంత ఓర్పు వచ్చింది పిల్లాణ్ణి ఎత్తుకోడానికి!

వాళ్ళంతా వెళ్తోంటే ఇందిర వీధి గుమ్మంలోనే చూస్తూ నించుంది. ఇందిర ఆలోచనలు పరిపరి విధాల పరుగులెత్తాయి. ప్రకాశం మునపట్లా దగ్గిర కూర్చుని "ఎలా వుంది ఇందిరా?" అని అడిగిన పాపాన పోడం లేదు. అయిదు నిముషాలయినా సరిగ్గా మాట్లాడటం లేదు.

ఇంటికి రాగానే "లలితా, లలితా" అనే కేకలే!

ఇందిరకి జ్వరం తగ్గిందిగానీ నీరసం తగ్గలేదు. లేచి తిరగలేకపోతోంది. డాక్టర్ని అడిగితే "రక్తం లేదమ్మా, ఇంకా కొన్నాళ్ళు మందులు వాడితేగానీ .... విశ్రాంతిగా వుండాలి" అంటాడు.

మందులు మింగుతూ, టానిక్కులు తాగుతూ, కుంటికోడిలా ఎంతసేపూ గదిలో పడుకోడం తప్పితే ఇంకేం చెయ్యలేకపోతోంది. కావలిసింది కూడా విశ్రాంతేగా? — నిట్టూర్చింది ఇందిర.

★ ★ ★

"అమ్మా! అమ్మా! పిన్ని .... నీ చీర కట్టుకుంటోందీ .... కట్టుకుంటోందీ ...." అంటూ రాగయుక్తంగా పాడుతూ గంతులేస్తూ వచ్చింది సుజీ.

ఏదో నవల చదువుకుంటోన్న ఇందిర, పుస్తకం మడిచి చూసింది.

"రామ్మా! చూపిస్తానూ!" అంటూ చెయ్యి పట్టుకుంది సుజీ.

ఇందిర లేచి వెళ్ళింది. పెట్టిమీద జరీ పువ్వుల నీలంచీర తీసివుంది. లలిత, బ్లౌజు కుట్లు వూడ తీస్తోంది. అక్కగార్ని చూడగానే నవ్వుతూ — "ఇవ్వాళ నీ చీర కట్టుకుంటానక్కయ్యా! నా బ్లౌజు లేవీ దానికి మేచ్ అవటం లేదు. ఇది చాలా టైట్‌గా వుంది నాకు .... మళ్ళీ కుట్టేస్తాలే" అంటూ దాని చేతులు పటపటా లాగి లూజు చేసింది.

ఇందిర నిర్ఘాంతపోతూ చూసింది.

"వద్దు, ఆ చీర చాలా కొత్తది. కాస్సేపు ఎటో తిరిగి రావటానికి అంత కొత్త చీరెందుకూ?" అందామనిపించింది.

"కట్టుకో, ఏం పోయింది?" అనేసి వచ్చేసింది.

ఇందిర మనసు మనసులో లేదు.

"పోనీ చిన్నపిల్ల. అస్తమానూ ఇంట్లో చాకిరీ చేస్తూ ఏం వుంటుంది? కాస్సేపు ఎటైనా తిరిగి వస్తే బాగుంటుంది" అనుకుంది మొదట్లో. బయటికి వెళ్ళటం ప్రారంభించిన దగ్గిర్నించీ ఒక్కరోజు కూడా మానలేదు బావా మరదళ్ళు. అప్పటికి ఆరుసార్లు సినిమాల

కెళ్ళారు. మిగతా రోజులు బీచ్‌కో, పార్కుకో షికార్లు! రోజూ కొత్త కొత్త బట్టలతో! రకరకాలుగా అలంకరించుకుని బయల్దేరుతుంది లలిత. ఆఫీసు .... పని .... పని — అని అలమటించే ప్రకాశం ఐదింటికల్లా ఇంటి కొచ్చేస్తాడు. కాఫీ తాగటమే ఆలస్యంగా బయల్దేరిపోతారు. తొమ్మిదికే తిరిగి రావటం! వచ్చి పిల్లలకి గబగబా తిళ్ళు అవగొట్టి తర్వాత ఇద్దరూ కబుర్లాడుకుంటూ నవ్వుకుంటూ తింటారు అన్నాలు.

"నువ్వు తిన్నావా? మందు తాగావా?" అని మొదటి రోజెప్పుడో అడిగాడు ప్రకాశం ఇందిరని. "ఆఁ, తిన్నాను" అని చెప్పింది. ఇక రోజూ అంతే కదా అన్నట్టు, తర్వాత ఆ అడగడమే మానేశాడు. వాళ్ళ తిళ్ళు అయ్యాక, ఇద్దరూ ముందు గదిలో కూర్చుని, ఇంకో గంట హస్కుకొట్టుకుని అప్పుడు పడుకుంటారు.

ఎన్నాళ్ళీవరస? దానికి బుద్ధిలేకపోతే ఈయన వివేకం ఏమైంది? సరే, వెళ్తే వెళ్తుంది. వెక్కిరించినట్టు ఏరి కోరి తన చీర కట్టుకోడం ఏమిటి?.... అన్ని బట్టలున్నాయి. దెయ్యంలాంటి పెట్టి తెచ్చుకుంది. అవన్నీ పనికిరాకపోయాయా?

నాలుగు నెలల కిందట, తమ పెళ్ళయి ఆరేళ్ళు నిండాయని ప్రకాశం స్వయంగా సెలెక్టుచేసి తెచ్చాడు ఆ చీర. ఆ రాత్రే కట్టుకుంది ఆ చీర ఇందిర. తల నిండా మల్లెపూలు పెట్టుకుంది. ఇందిరని చూసి ప్రకాశం చాలా మురిసిపోయాడు.

"సినిమాకి వెళ్దామా?" అన్నాడు.

"ఇప్పుడేం సినిమా? అన్నాలు తినేసి కబుర్లు చెప్పుకుంటూ కూర్చుందాం" అంది ఇందిర.

అన్నాలు తిన్నాక వంటిల్లు సర్దుకుని వచ్చేసరికి ప్రకాశం దొంగ నిద్ర నటిస్తున్నాడు.

పిల్లలిద్దరూ నిద్రపోతున్నారు.

ఇందిర నిశ్శబ్దంగా అగరొత్తులు వెలిగించి వెనక్కి తిరిగింది.

ప్రకాశం చీకట్లో దొంగచూపులు చూస్తున్నాడు. చెయ్యి పట్టుకుని దగ్గిరికి లాక్కున్నాడు — "చీకట్లో కూడా ఈ చీరమీద పువ్వులు మెరుస్తున్నాయే! అబ్బ! నువ్వెంత అందంగా వున్నావు ఇందూ!" అన్నాడు దగ్గిరికి తీసుకుంటూ.

ప్రకాశం, అప్పుడు ఆ మాటలు మనసారానే అన్నాడని ఇందిరకి ఇప్పటికీ అనిపిస్తోంది. ఆ చీర ఇందిరకి చాలా ముద్దుగా అనిపిస్తుంది. ఆ చీరతో తను ఆయన చేతుల్లో వొరిగింది. ఇప్పుడు ఆ చీరతోనే లలిత ఆయన ముందు తిరుగుతుందా? 'వొద్దు, వొద్దు లలితా! నా చీరలు నువ్వు కట్టుకోకూడదు. బాగుండదు. నీ బట్టలు నువ్వు కట్టుకో' అని చెప్పేద్దామనుకుంటూ ఓపిక తెచ్చుకుని లేచింది.

"అక్కయ్యా! ఎలా వుంది?" అంటూ వచ్చింది లలిత, ఆ చీరతో!

ప్రాన్పడిపోయింది ఇందిర. లలిత ఆ చీర కట్టేసుకుంది. జరీ అంచు పాదాల మీదికి జీరాడేలాగా పొడుగ్గా పెట్టుకుంది కుచ్చెళ్ళు. పైట కొంగుకూడా పొడుగ్గా వేసుకుంది. రింగులు తీసేసి, అక్కగారి రాళ్ళ దుద్దులు పెట్టుకుంది. చేతులకి నిండుగా నీలిరంగు గాజులు వేసుకుంది. కళ్ళకి కాటుక దిద్దుకుని గుండ్రటి కుంకుమ బొట్టు పెట్టుకుంది. ఇందిరవే మఖ్మల్ స్లిప్పర్స్ తొడుక్కుంది.

"ఎలావుందక్కయ్యా!" అంది లలిత రెట్టిస్తూ .... తనకేసి తనే చూసుకుంటూ.

"అమ్మలా వుంది. అమ్మలా వుంది" అంటూ గంతులేసింది సుజాత.

నిజంగా ఇందిరే భ్రమపడింది. ఐదారేళ్ళ కిందట తను అచ్చం అలాగే వుండేది.

"బాగుందే! చాలా బాగుంది ...." అంది ఇందిర భారంగా — "మీ బావ ఇంకా రాలేదా?" అంది.

"లేదు. ఇంకా రాలేదు. అదే చూస్తున్నాను."

అదే చూస్తోందట! తనకు కూడా లేని తహతహ! నిరీక్షణ!

ప్రకాశం రానే వచ్చాడు. లలితని ఆపాదమస్తకం ఆశ్చర్యంగా చూశాడు, తన కళ్ళముందే! "వాటె వండర్! ఇద్దరు ఇందిరలా! అసలు ఇందిరెవరో తెలీటం లేదే!" అంటూ లలిత పైటకొంగు పట్టుకోబోయాడు హాస్యంగా చేస్తోన్నట్టు.

లలిత చిరుకోపంతో విదిలించుకుంటూ — "కళ్ళజోడు పెట్టుకోరాదూ?" అంది.

ఇందిర మాట్లాడలేదు. అసలు ఇందిర ఎవరో తెలీటంలేదట! అదా హాస్యం!

"లలితా! బావకి కాఫీ తెచ్చియ్యి" అంది చిరాకు కన్పించనీకుండా. తను చెప్పకపోయినా అదే ఇస్తుంది. ఏవిటో తన పెద్దరికం! 'బావకి కాఫీ ఇయ్యి, అన్నం పెట్టు' అని ఎప్పటికప్పుడు తను చెప్తూనే వుంటుంది.

ప్రకాశం మొహం కడుక్కు వచ్చి కాఫీ తాగాడు. లలితని ఎగాదిగా చూస్తూ "ఏం కథ? పెళ్ళికూతురిలా తయారయ్యావ్?" అన్నాడు.

ఏది మాట్లాడినా హాస్యం! మరదలితో హాస్యం!

లలిత మూతి ముడిచింది — "నువ్వే అంతా మర్చిపోతే .... నే నసలు రాన్లే."

"బాబోయ్! అంతకోపమే! ఈ దీనుడు మన జాలడు."

"లేకపోతే ఎవరో ఫ్రెండింటికి వెళ్దామని చెప్పి ఏం కథ అని అడుగుతావేం?"

"వెరీ సారీ లలితా! మర్చిపోయాను. అయితే నువ్వు రెడీయేగా?"

"ఆఁ"

"పద. లెఫ్ట్ రైటేనా?"

"దగ్గిరే అన్నావుగా?"

"మరీ అంతదూరం కాదులే, కబుర్లు చెప్పు కుంటూ నడిస్తే ఎంత సేపు? అంత నడవలేకపోతే అప్పుడే ఎక్కేద్దాం రిక్షా! .... ఇందిరా! మేం వెళ్తాం. నిద్రపోకు. మళ్ళీరాత్రి నిద్రపట్టటం లేదని గొడవ చేస్తావు" అంటూ బాబుని ఎత్తుకున్నాడు ప్రకాశం.

ముభావంగా కూర్చుని వున్న ఇందిర తలఎత్తి "వాణ్ణి ఉంచెయ్యండి. రోజూ అలా బయట తిప్పు తోంటే ఏ రొంపైనా చేస్తుంది. రాత్రంతా దగ్గుతూనే వున్నాడు" అంది.

ప్రకాశం బాబుని ఇందిరకి అందిస్తోంటే వాడు వుండనని పెనుగులాడాడు. ప్రకాశం బలవంతంగా దించేస్తూ — "అమ్మ దగ్గిర వుండు నాన్నా! బిళ్ళలూ బిస్కత్తులూ అన్నీ తెస్తాను" అంటూ నచ్చచెప్ప బోయాడు.

బాబు ఏడుస్తోంటే ఇందిర లేచి ఎత్తుకుంది.

ప్రకాశం, లలితా, సుజా వెళ్ళిపోయారు.

వీధి తలుపులు వేసేసి ఏడుస్తోన్న పిల్లాడికి రెండు బిస్కట్లిచ్చి మళ్ళీ గదిలో కొచ్చింది ఇందిర. బావురు మని ఏడ్చేయ్యాలనిపించింది. రోజు లెంత చిత్రంగా మారిపోయాయి! తనతో మాట్లాడే వ్యవధే చిక్కటం లేదు తన భర్తకి! .... తనే సర్వస్వంలా ప్రవర్తించే వ్యక్తికి! లేకపోతే అదంతా అబద్ధమా? ఇదే నిజమా?

లేచిన దగ్గర్నించీ ఉరుకులతో పరుగులతో ఆఫీసు! మరదలితో, కబుర్లతో నవ్వులలో కొట్టుకు పోతూ మధ్యాన్నం భోజనం! మళ్ళీ ఆఫీసు. సాయంత్రం షికారు. ఎప్పుడో ఇంటికి రావడం. తిండీ నిద్రా. ఇక టైమేదీ? జబ్బు మనిషితో మాట్లాడేంత తీరికేదీ? — మనస్సంతా వికలమైపోయింది ఇందిరకి. అసలు తనని వదిలేసి బైటికి పోవడం ఏమిటి? తన ఆరోగ్యం ఏం బాగుపడిందనీ? ప్రతీ సాయంత్రం ఇంట్లోనే ఉండకూడదూ?

తలగడ మీదికి ఒరిగి ఇంటికప్పుకేసి చూస్తూ పడుకుంది. జరీ పువ్వుల నీలంచీరని చూస్తే తన కేవేవో గుర్తొచ్చాయి. ఆయనకీ ఏవైనా జ్ఞాపకం వచ్చాయా? ఆ చీర లలిత ఒంటిమీదా! రేపు మళ్ళీ తన ఒంటిమీదా!

తనని అడక్కుండానే లలిత తన జరీచీర తీసే సింది! అప్పుడు తను ఎందుకు చెప్పలేదు? "వొద్దు లలితా! అది కొత్త చీరా, పాత చీరా అని కాదు. నా చీరలతో నాకూ నా భర్తకీ సంబంధం వుంటుంది. అక్కచెల్లెళ్ళు చిన్నప్పుడైతే ఒకళ్ళ బట్టలు ఒకళ్ళు కట్టు కోవచ్చుగానీ, ఒకళ్ళకి పెళ్ళయి పోయాక, ఎవళ్ళ బట్టలు వాళ్ళే కట్టుకోవాలి. ఆ చీర నువ్వు కట్టుకోవద్దు, లోపల పెట్టెయ్యి!" అని గట్టిగా ఎందుకు చెప్పలేదు? తనకే తెలిసేడవకపోతే దానికేం తెలుస్తుంది? ... అయినా, తనతో అనకుండానే తన జరీచీర తీసేసి, తన జాకెట్టుకి కుట్లు విప్పేసి ... ఏవిటీ మనిషి! ఈయనైనా దాన్ని అడుగుతాడా? 'మీ అక్కయ్యని అడిగే కట్టుకున్నావా?' అంటాడో లేదో!

★ ★ ★

"ఈ చీర మీ అక్కకన్నా నీకే బాగుంది లలితా! నిజం" అన్నాడు ప్రకాశం, లలిత మొహంలోకి గుచ్చి గుచ్చి చూస్తూ.

లలితని ఫ్రెండింటికి తీసికెళ్ళాలని బయల్దేరిన

ప్రకాశం, తీరా కొంతసేపు నడిచాక — "ఇప్పుడెళ్తే వాళ్ళుంటారో లేదో! పోనీ బీచ్‌కిపోయి కూర్చుందాం లెద్దూ! సరదాగా కబుర్లు చెప్పుకుందాం" అన్నాడు.

"అయితే పద" అంది లలిత వెంటనే.

ఇద్దరూ రిక్షాలో కూర్చున్నారు. దిగేంతవరకూ ప్రకాశం శరీరం నిండా విద్యుత్తు పరుగులెత్తింది. వారగా లలిత ముఖం చూస్తూ కూర్చున్నాడు. రిక్షా దిగి బాగా దూరం నడిచి జనం లేని చోట ఏకాంతంగా కూర్చున్నారు.

"మాట్లాడవేం?" అంటూ రెట్టించాడు ప్రకాశం.

లలిత అప్పుడే స్వప్నం లోంచి తేరుకున్నట్టు నెమ్మదిగా కళ్ళు విప్పి "ఏమిటి?" అంది.

"ఈ చీర నీకు చాలా బాగుంది."

"ఎవరికైనా బాగానే వుంటుంది."

"అలాక్కాదు. ఎంత అందమైన బట్టలైనా కొంద రికే రాణిస్తాయి. నువ్వు మీ అక్కకన్నా ఎత్తు; తెల్లటి తెలుపు, బొద్దుగా వుంటావు. అందుకే నీకు మరీ బాగుంది."

"బావగారు బట్రాజు లౌతున్నారే!" అంది లలిత నవ్వుతూ.

"నీలాంటి అందగత్తెని చూస్తోంటే కవిపుంగవుణ్ణి కూడా అయిపోతాను" అన్నాడు బెదిరిస్తున్నట్టు.

లలిత చిరునవ్వు నవ్వింది విలాసంగా. లలిత పైట చెంగు గాలిలో ఎగిరెగిరి పడుతోంది. ఆ కొంగు పట్టి దగ్గిరికి లాక్కోవాలని గుబగుబలాడుతోన్న మన స్సుని మందలించలేక — "ఆ కొంగు అలా వది లేశావేం?" అన్నాడు ఏదో మాట్లాడాలని.

"దానికి స్వతంత్రం ఇచ్చేశాను."

"అదేం స్వతంత్రం? చీరంతా విప్పేసి గాలిలోకి విసిరెయ్."

కిలకిలా నవ్వింది లలిత.

పాదాల మీద ఇసక పోసుకుని ఆడుకుంటోన్న సుజా తలతిప్పి పిన్నికేసి చూసింది. గబగబా లేచి వచ్చి లలిత పైట కొంగు పట్టుకుని భుజంమీద కప్పుతూ — "పిన్నీ! మా అమ్మయితే ఇలా వేసుకుంటుంది" అంది.

"ఛీ! పోవే! వెధవ ఇసక చేతుల్తో నా జాకెట్టంతా పాడు చేశావు. పెద్దాపేరక్కలా ముసుగెట్టుకో మంటావా?" అంటూ విసుక్కుంది లలిత.

సుజాత మళ్ళీ తన ఆటలో మునిగిపోయింది.

లలిత ఎప్పటిలా మాటలు పెంచకుండా అడిగిన దానికి మాత్రమే సమాధానాలిస్తూ సముద్ర కెరటాలకేసి చూస్తూ కూర్చుంది.

నీరెండ తెల్లటి ఇసక మీదా, నీటి నురుగుల మీదా పడి వెన్నెలలా మెరుస్తోంది. చల్లటి గాలి హాయిగా ఒంటిని తాకుతూ ఆహ్లాదం కలిగిస్తోంది. సముద్రం తన మహాగర్భంలో ఎన్నో కోట్ల సంగీత వాయిద్యాలు దాచుకున్నట్టు గంభీరంగా తరంగాల పాట పాడుతోంది.

"లలితా!" అంటూ అప్రయత్నంగా లలిత చేతిని పట్టుకున్నాడు ప్రకాశం.

చురచురచూస్తూ లలిత చెయ్యి లాక్కున్నప్పుడు గానీ తనేం చేశాడో ప్రకాశానికి తెలియలేదు — "అది కాదు లలితా! చెయ్యి చూస్తాను" అన్నాడు తొణక కుండా.

"ఏం చూస్తావు? జోస్యం చెప్తావా?"

"ఏదో చెప్తాగా? చెయ్యిలాతే, ముట్టుకుంటే నీ బంగారం నాకేం అంటదులే" అంటూ చొరవగా లలిత చెయ్యి తన చేతుల్లోకి తీసుకున్నాడు. తెల్లగా మృదువుగా మెత్తటి బంగారంతో చేసినట్టుందా చెయ్యి. గలగలమంటూ గాజులన్నీ ముంజేతి మీదికి వచ్చిపడ్డాయి. హస్తసాముద్రికం ఎంతో తెలిసినవాడి లాగా ఆ అరచెయ్యి విప్పి గీతలవేపు గుచ్చి గుచ్చి చూశాడు ప్రకాశం.

"ఊఁ! తెలిసింది. చెప్పనా?"

చెప్పమన్నట్టు నవ్వింది లలిత.

"ఈ పాణిగ్రహణం చేసినవాడు ధన్యుడౌతాడు."

"ఊఁ" ఎడంచేతి చూపుడు వేలు పెదవుల్లో పెట్టుకుంది, సినిమాల్లో లాగ.

"ఈ అందమైన చేతితో అందించిన పదార్థం ఏది తిన్నా సరే, అమృతాన్ని రుచి చూసినట్టు, పీనుగు లాంటి వాళ్ళయినా ఏనుగులౌతారు."

"భలే వుందే జోస్యం! ఖర్మగాలి ఈ చేత్తోనే చెంపకాయతింటే?"

"దాసాను దాసుడౌతాడు."

నవ్వింది లలిత — "చాల్లే" అంటూ చెయ్యి లాక్కోబోయింది. ప్రకాశం వదలకుండా గట్టిగా పట్టుకున్నాడు — "నేనో మాట అడుగుతాను. నిజం చెప్తావా?" కొంటెగా చూశాడు. "కాలేజీలో నువ్వెవరినైనా ప్రేమించావా? నువ్వు ప్రేమించక పోయినా కుర్రాళ్ళు వూరుకోరే! ప్రేమలేఖలు వస్తూనే వుండాలి. అవునా?"

లలిత సిగ్గుపడ్డదానిలా తల దించుకుంది. "నువ్వు చదువుకునే రోజుల్లో ఎన్ని ప్రేమలేఖలు రాశావేమిటి?"

"రాసినవి కొన్నీ .... రాయనివి కొన్నీ .... రాసీ రాయనివి కొన్నీ."

"అందరూ అలాగే అనుకోరాదూ?"

"అయితే నీకు ప్రేమపత్రాలు వస్తూనే వున్నాయన్నమాట! ఎవడి మొర అయినా చెవిని పెట్టావా? ఆ అర్జీలు కుంపట్లో పడేశావా?"

తన చిరునవ్వు కోసం .... తన పలకరింపు కోసం .... తన స్నేహం కోసం తపిస్తూ ఉత్తరాలు రాసే రమేష్ గురించి బావతో చెప్పేద్దామా అనుకుంది లలిత. తీరావింటే ఏమంటాడో! ఒక్క రమేష్ ఏమిటి? ఎంత మంది రమేష్‌లైనా తన కోసం తపిస్తారు. — లలిత మళ్ళీ సముద్ర కెరటాలలోకి చూస్తూ కూర్చుంది.

"మనిషంత మనిషిని పక్కన కూర్చుని వుంటే నువ్వా నీళ్ళల్లో వెతుక్కుంటా వెందుకూ? ఏ రాజ కుమారుడైనా ఓడ మీద వస్తానన్నాడా? స్వప్న సందేశం పంపించాడా?"

లలిత నవ్వింది — "నిజంగానే నీకు కవిత్వం వస్తోంది బావా!"

"కవిత్వం కాదు, ఉన్నమాటే. నిన్నెవడు కొట్టేస్తాడో గానీ లక్కీ ఫెలో! అభినందించాల్సిందే వాణ్ణి!"

"ఏం? నీకు జలసీగా వుందా?"

"ఉండదూ?"

"ఎందుకూ?"

"ఎందుకేమిటి? మనకి దక్కనిది ఇంకోడికి దక్కితే జెలసీ రాదూ? అసలు రెండేళ్ళాగి నిన్నే చేసుకోవాల్సింది నేను" అన్నాడు హాస్యంగా అన్నట్టు.

కిలకిలా నవ్వింది లలిత — "అక్కయ్యవింటే బాగానే అవుతుంది నీ పని."

"ఏం? దాని దగ్గరే అంటాను. ఎప్పుడూ మూలుగుతూ పక్క వదలకుండా పడుకోడం బాగా తెలుసు మీ 'అ.... క్క .... య్య' గారికి. నీ కాలిగోటికి కూడా తీసికట్టే" విసుక్కున్నాడు ప్రకాశం.

"నిజంగా బావా! ఎప్పుడూ అలా ఈసురోమంటూ వుండే వాళ్ళని చూస్తే నాకు చెడ్డ అసహ్యం! చకచకా పనులు చేసేసుకోవాలి. సినిమాకో షికారుకో ఏదో ఒకటి .... యాక్టివ్‌గా తిరుగుతూ వుండాలి. లేకపోతే లైఫ్ డల్‌గా వుంటుంది బాబూ!"

"డల్‌గా వుండటమేమిటి? మహాబోర్ కొడుతుంది. ఎప్పుడూ ఇల్లూ పిల్లలూ, రోగాలూ తెగుళ్ళూ .... డాక్టర్లూ మందులూ, ఛీ!"

"అసలు తెగుళ్ళు రావడానికి సైకలాజికల్ ఫీలింగే కారణం బావా? ఉత్సాహంగా లేనివాళ్ళకే ఈ తెగుళ్ళన్నీ వస్తాయి. నేనో పుస్తకంలో చదివాను. ఉత్సాహం లేకపోతే, వాళ్ళూ బాధపడతారు, ఇతర్లనీ బాధపెడతారు."

"బాగా చెప్పావు. బాధ కాకపోతే ఏం సుఖం వుంది?" నిస్పృహగా అన్నాడు ప్రకాశం.

"అలా అనకు బావా!" లలిత ప్రకాశం కళ్ళల్లోకి సానుభూతిగా .... ఓదార్పుగా .... జాలిగా .... అనునయంగా .... ఎలాగో ఎలాగో చూసింది. "బావా! నేనే నీ భార్యనైతే నీకు స్వర్గసుఖాలు చూపించేదాన్ని. ఆనంద సాగరాల్లో ముంచెత్తేదాన్ని. వెన్నెల సీమల్లో తేలించేదాన్ని" అని లలిత చూపులు చెప్పినట్టుగా ప్రకాశం ఊహించాడు.

ఎందుకో నిట్టూర్చాడు ప్రకాశం.

లలిత చిన్నకంఠంతో — "ఏదైనా పాడనా బావా? ప్లీజ్! నువ్వు మాత్రం అంత డల్‌గా వుండకు, నేను భరించలేను" అంది.

"అబ్బే! ఏం లేదులే, పాడు" మొహం తిప్పుకుని సముద్రం కేసి చూస్తూ కూర్చున్నాడు.

లలిత రెండు నిమిషాలసేపు తనకు వచ్చిన పాటలన్నీ మననం చేసుకుంది.

"నల్లనివాడా! నే గొల్లకన్నెనోయ్! పిల్లనగ్రో వూదవోయ్! నా యల్లము రంజిల్లగా ...." అంటూ పాడింది. బాలసరస్వతి స్వరంలోని మృదుత్వం

తప్పితే అంతా అలాగే పాడింది. వినటానికి చాలా ఇంపుగా.

"బాగుంది లలితా! చాలా బాగా పాడావు. ఇంకో పాట పాడు" అన్నాడు ప్రకాశం.

ఇంకోటి — ఇంకోటీ — నాలుగైదు పాటలు పాడింది లలిత.

ప్రకాశానికి ఉత్సాహం వచ్చింది "ఎవ్వడైనా ప్రొడ్యూసర్ విన్నాడంటే నిన్ను తప్పకుండా సినిమాల్లోకి పట్టుకుపోతాడు."

పొంగిపోయింది లలిత — "బావా! నిజంగా నాకు సినిమాల్లో పాడాలని వుంది."

గాలి, సినిమాల మీదికి మళ్ళింది. లలిత, పాట గాళ్ళని చాలా మందిని విమర్శించింది. కొంతమందిని మెచ్చుకుంది.

"మంచి ఛాన్స్ వస్తే తప్పకుండా వెళ్ళవచ్చు లలితా!"

"వెళ్తాగానీ మంచీ చెడ్డా ఎలా తెలుస్తాయి?"

"అంత పని మాత్రం చెయ్యకు. ఏమో .... ఏమౌతుందో నమ్మలేం. అయినా నీకు వయస్సు మాత్రం ఏదీ? ముందు చదువు కానీ."

"పిన్నీ! ఇంటికి పోదామే!" హఠాత్తుగా లేచింది సుజా.

బావా మరదళ్ళిద్దరూ బాహ్య ప్రపంచంలో కొచ్చి పడ్డారు. కళ్ళు విప్పి చూశారు. బాగా చీకటి పడింది. లలిత సుజా చెయ్యిపట్టి కూర్చోబెట్టింది. "అప్పుడే ఇంటికెళ్ళి ఏం చెయ్యాలి? కూర్చో, వెళ్దాంలే" అంటూ.

"ఊహూ! నాకు నిద్రొస్తోంది."

"నా ఒళ్ళో పడుకో, ఇంటికెందుకూ?"

"ఆకలేస్తోంది పిన్నీ!"

"అబ్బబ్బ! ఏం సాధిస్తున్నావే! రేపు నిన్ను తీసుకొస్తామేమో చూడు."

"పోనీ లలితా! పద వెళ్దాం. చీకటి పడిపోయిందిగా?" అంటూ లేచాడు ప్రకాశం. లలితకీ లేవక తప్పలేదు.

ఇందిర, తలుపులు తీసి గదిలో కెళ్ళిపోయింది. సుజా అన్నం తినేసి తల్లి పక్కలో చేరింది. "అమ్మా! — నిన్ను .... నాన్న తిట్టాడే! .... పిన్ని కూడా తిట్టిందే ...." అంది ఏదో చెప్పాలన్న తాపత్రయంతో.

"ఛ! తిట్టటం ఏమిటి?" అంది ఇందిర అర్థంకాక.

"నీకు .... జొరం .... జొరం .... ఎప్పుడూ పడుకుంటావంట ...."

ఇందిరకి అర్థమైంది కొంతవరకైనా.

"ఇంకా నాన్నేమో ...."

"సరేలే, పడుకోమ్మా" కూతుర్ని బుజ్జగించింది ఇందిర.

కళ్ళు మూసుకుని పడుకుంది సుజా. కాస్సేపటికి — "మరేమో పిన్ని .... ఎంచక్కా పాటలు పాడిందే!" అనేసింది వుండబట్టలేక.

"అసలు మీరెక్కడి కెళ్ళారు?" అడగొద్దనుకుంటూనే అడిగింది ఇందిర.

"బీచ్‌కమ్మా! ఇసకలో ఆడుకున్నాను."

ఇందిర సుజా తల తడిమింది. పాపిడినిండా ఇసకే — గౌను జేబునిండా ఇసకే — "సరేలే! పడుకో" అంది జోకొడుతూ.

వంటింట్లోంచి మాటలింకా విన్పిస్తోనే వున్నాయి.

కాస్సేపటికి ప్రకాశం పడుకోడానికి వచ్చాడు. "ఇందిరా! బాబేమన్నా ఏడిచాడా?"

"లేదు."

"నీ ఒంట్లో ఎలా వుంది?"

"బాగానే వుంది."

"బాగానే వుందంటావ్. లేచి తిరగవేం? కాస్త హుషారుగా ఇటూ అటూ తిరుగుతూండాలి. జ్వరం లేదుగా?"

ఇందిర మాట్లాడలేదు.

ప్రకాశం పడుకున్నాడు.

ఎంత ప్రయత్నించినా .... ఎంత సరిపెట్టుకున్నా .... ఇందిరకి తెల్లవార్లూ నిద్రపట్టలేదు. ఇందిర మనసు ఏదేదో ఆలోచనలతో సతమతమైంది తెల్లవార్లూ.

మనుషులు ఇంత వింతగా మారిపోతారా? తన భర్త .... తనని ఇలా నిర్లక్ష్యం చేసే రోజు వస్తుందని .... జీవితం ఇంత చేదునిజాల్ని మింగిస్తుందని .... ఒకనాడు ప్రేమతో ఉప్పొంగిన హృదయం ఇంత ఎడారిలా ఎండిపోతుందని తను అనుకుందా?

ఇందిర జాగారం చేసింది రాత్రంతా.

కళ్ళు ఉబ్బి ఎర్రగా జేవురించాయి. తెల్లారే పాటికి పుట్టెడు నీరసం! లేచి పనులు చేసుకుందామను కుంది.

గది కదలబుద్ధి కాలేదు. ఎలాగో స్నానం చేసి తల దువ్వుకుని మళ్ళీ గదిలోకేవచ్చి కూర్చుంది.

ప్రకాశం ఆఫీసు కెళ్ళిపోయాడు. లలిత వంట చేస్తోంది.

లలితని పంపించేస్తే?

పిచ్చి ఊహ! లలితని పంపించేసి, భర్తని దక్కించుకోవాలా? అదేనా తను కోరుకొంటోంది?

లలిత వీక్లీ కోసం ఎదురుచూస్తూ తనతో తర్కిం చిన నాలుగు మాటల్లోనూ లలిత హృదయం కన పడుతోంది. కథల్లోనే కాదు, జీవితాల్లోనూ అలాగే జరగాలనుకుంటుందేమో లలిత!

★ ★ ★

గతమంతా తల్చుకుంటూ పడుకున్న ఇందిర మ్రాన్పడిపోయింది ఎంతోసేపు. లలిత మనస్సు ఇంత స్పష్టంగా తెలిసి కూడా ఇంకా తను నిర్లిప్తంగా వూరుకోవచ్చునా?

ఇదంతా తనకోసం కాదు, లలిత కోసం! .... లలిత క్షేమం కోసం! లేకపోతే తను లలితకి చాలా అన్యాయం చేసినట్టు అవుతుంది. పరిస్థితి ఇంకా విషమించనివ్వకూడదు. ఎంతైనా అది చిన్నపిల్లే!

"అయితే ఇవ్వాళా వీక్లీరాలేదన్నమాట. అనుకున్న దంతా చేశాడు. దొంగవెధవ" అంటూ లలిత పేపరు ఒక్కటీ పట్టుకుని వెళ్ళిపోయింది.

ఇందిర లేచి వంటింట్లోకి వెళ్ళింది. చేతికందినది సర్దుతూ కాస్సేపు తిరిగింది — "లలితా! అన్నం తిందాం వస్తావా?" అని గట్టిగా పిల్చింది.

లలిత పేపరు పట్టుకుని వంటింట్లోకి వచ్చి "రోజూ బావకి పెట్టి తింటున్నాగా?" అంది.

"ఇవ్వాళ బావకి నేను పెడతాలే, నువ్వు తినే సెయ్, నేనూ తినేస్తా. వడ్డిస్తున్నా" అంటూ పళ్ళాలు తీసింది ఇందిర.

లలిత ఇబ్బందిగా మొహం పెట్టి "అప్పుడే ఏం అన్నం బాబూ? నాకు ఆకల్లేదు" అని విసుక్కుంది.

"అప్పుడే ఏమిటి? పదకొండు దాటింది. అసలు నీకు తొమ్మిదవకుండానే తినేసి కాలేజికి పోవటం అలవాటేగా?"

"అవుననుకో. ఇక్కడి కొచ్చాక ...."

"మరీ చోద్యం! నాలుగేళ్ళ నించీ వున్న అలవాటు ఇక్కడ నెల్లాళ్ళకే మారిపోయిందా? సరేలే, నువ్వు తినొద్దులే. నేను తినేస్తాను."

"అయితే నాకూ పెట్టెయ్, తినేస్తా" అంటూ పేపరు పడేసి వచ్చి కూర్చుంది.

పెద్దగా మాటలేమీ జరగలేదు.

"అబ్బ, ఆకలి వెయ్యటం లేదు" పెట్టిన అన్నం అంతా తీసేసి పిడికెడు అన్నం వుంచుకుంది. ఇందిర కూడా రోజులా తినలేక పోయింది.

మధ్యాన్నం, ఆఫీసునించి ప్రకాశం వచ్చాడు.

అన్నం వడ్డిస్తూ ఇందిర కన్పించింది.

"ఏం? లలితేమైంది?"

"చదువుకుంటోంది. కూర్చోండి. నేను పెడ తాను."

"పిలిస్తే వస్తుందిగా? నీకెందుకూ శ్రమ? వెళ్ళి పడుకో!"

"మీకు అన్నం వడ్డించటానికి నాకు శ్రమేమిటి? కొంచెం ఓపిగ్గానే వుంది. ఎన్నాళ్ళు పడుకుంటాను? విసుగొస్తోంది."

"అదిగాదు. మళ్ళీ ఒంటికేమైనా అవుతుందేమో!"

"తేలిగ్గావుంది కాబట్టే లేచి తిరుగుతున్నాను."

అన్నం ముందు కూర్చున్నాడు. "అబ్బో! ఇంత అన్నం పెట్టేశావేమిటి?"

"మీ తిండి నాకు తెలీనట్టు మాట్లాడతారేం?"

విన్పించుకోకుండా అన్నం తీసేశాడు.

"అసలేమైనా కడుపు నిండాలా?"

"నిండకేం?" అంటూ నాలుగే నాలుగు ముద్దలు తినిలేచాడు.

వండుకున్నదంతా గిన్నెలోనే వుంది. అందరి కడుపులూ నిండిపోయాయి. ఇందిర పళ్ళెం తీసి గిన్నెలన్నీ సర్దుతోంది.

ప్రకాశం లలిత దగ్గిరకి వెళ్ళాడు.

"కోపం వచ్చిందా అమ్మాయిగారికి?"

బోర్లా పడుకున్న లలిత తలెత్తి చూసింది. "ఎందుకూ?"

"ఏమో! అన్నం పెట్టకుండా తప్పించు కున్నావుగా?"

"చాల్లే! మా అక్కయ్యే వడ్డిస్తానంటే వూరు కున్నాను."

ఇందిర వంటింటి తలుపులు వేసి వచ్చింది.

ప్రకాశం తలదువ్వుకుంటూ అన్నాడు. "అయితే నీకు ఆరోగ్యంగానే వుందన్నమాట. థేంక్ గాడ్!"

ఇందిర మాట్లాడలేదు.

ప్రకాశం మళ్ళీ ఆఫీసుకి వెళ్ళిపోయాడు.

మధ్యాన్నం పొయ్యి ఇందిరే అంటించి పనులు మొదలుపెట్టింది.

లలితకి చాలా ఆశ్చర్యంగా వుంది. అక్కయ్య ఏమిటో కొత్తగా కనిపించింది.

"అదేమిటక్కయ్యా! అన్నం నేను వండేస్తాలే. నీకు మళ్ళీ జ్వరం తిరగబెడుతుందేమో!"

"ఫర్వాలేదు. జ్వరంవస్తే వంట చెయ్యలేంగానీ వంట చేస్తే జ్వరం రాదు."

లలితకేం తోచలేదు. ఏదో పుస్తకం పుచ్చుకుంది గానీ చదవబుద్ధికాలేదు. మాటిమాటికీ వీధిగుమ్మంకేసి చూస్తూ కూర్చుంది.

సాయంత్రానికి ప్రకాశం రానేవచ్చాడు. రోజూలా "లలితా! రెడీయేనా?" అన్నాడు. అంతలోనే లలిత వాలకం చూసి "అరె! ఇంకా ఇలాగే వున్నావేం? ఇవ్వాళ ఎటూ వెళ్ళొద్దా?" అన్నాడు నీళ్ళు కారిపోతూ.

"ఎటు వెళ్దాం?" అంది లలిత కొంచెం నెమ్మదిగా.

"కాస్సేపు ఎటయినా తిరిగొద్దాం. బైటికెళ్ళాక ఆలోచించుకోవచ్చు."

లలిత, మొహం కడుక్కుని జడవేసుకుంది. పెద్ద అలంకారాలేమీ చేసుకోలేదు. జోళ్ళు తొడుక్కుని రెడీగా నించుంది.

"ఇందిరా! ఒంట్లో బాగానే వుందని ఆర్భాటాలేమీ చెయ్యకు. అన్నం వండెయ్యి. చాలు" అంటూ హెచ్చ రించి వంటిల్లు దాటాడు ప్రకాశం.

ఇందిర అయోమయంగా కూర్చుండి పోయింది. పొద్దుటినించీ తను లేచి తిరుగుతూనే వుంది. ఒంట్లో బాగానే వుందని కూడా చెప్పింది. తనూ వస్తుందేమోనని వాళ్ళకెందుకు తోచలేదు? "నువ్వూ వస్తావా?" అని మాటవరసకన్నా అడగొద్దూ? అసలు తన గురించి వాళ్ళేమనుకుంటున్నట్టు?

"ఇప్పుడు మీ అక్క ఏం చేస్తూ వుంటుందో తెలుసా?" అన్నాడు ప్రకాశం దారిలో.

"ఏం చేస్తూ వుంటుంది?"

"పొడుగాటి చీపురు పట్టుకుని కొంగు బొడ్లోదోపి ఇంట్లో బూజులు దులుపుతూ వుంటుంది" నవ్వాడు ప్రకాశం.

లలితకి నవ్వాలన్నంత ఉత్సాహంగా లేదు. అయినా కిలకిలా నవ్వింది.

★ ★ ★

కొంచెం తొందరగానే తిరిగి వచ్చారు ఇంటికి.

ఇందిర వీధివాకిట్లో చాప వేసుకుని, పిల్లాణ్ణి దగ్గిర పెట్టుకుని పడుకుంది.

"అదేమిటి? మంచులో కూర్చున్నావు" అన్నాడు ప్రకాశం.

"మంచేంలేదు. బాగానే వుంది" అంది ఇందిర క్లుప్తంగా.

"అయినా మంచిది కాదు. లోపలికి వెళ్ళి పడుకో."

ఇందిర లేవలేదు. ప్రకాశం లోపలికి వెళ్ళి పోయాడు.

వంటింట్లోకి వెళ్ళిన లలిత బయటికివస్తూ "అక్కయ్యా! నువ్వింకా అన్నం తినలేదా? అన్నం అంతా అలాగే వుంది" అంది.

"లేదు. మీరిద్దరూ తినెయ్యండి!"

"ఏం? నువ్వూ రారాదూ?"

"నేనివ్వాళ తినన్లే. ఏమిటోలా వుంది."

లలిత వెళ్ళిపోయింది.

పావుగంటలో ఇద్దరూ అన్నాలు తిని బయటి కొచ్చారు.

"చూశావా? వద్దు మొర్రో అంటే వినకుండా లేచి తిరిగావు. ఏదో అయింది. ఇంకా కొన్నాళ్ళు రెస్ట్

తీసుకుంటే నీదేం పోయింది?" అన్నాడు మందలిస్తున్నట్టు ప్రకాశం.

"ఇప్పటికే నా సర్వస్వం పోయింది" అందా మనుకుంది ఇందిర. లేచి లోపలికి వెళ్ళిపోయింది.

ప్రకాశం లలితా చెరో కుర్చీలో కూర్చున్నారు. కబుర్లు చెప్తూ ఖారాకిళ్ళీ నములుతూ ప్రకాశం, "లలితా! కొంచెం మంచినీళ్ళు తెస్తావా?" అన్నాడు.

లలిత వంటింట్లోకి వెళ్ళి అక్కగార్ని చూసి ఆశ్చర్యపోయింది. ఇందిర అన్నం తింటోంది!

గ్లాసుతో నీళ్ళు తీసుకుని బయటికి వచ్చేసింది. — "మా అక్కయ్య అన్నం తింటోంది."

"అన్నం తింటోందా? ఒంట్లో బాగా లేదని చెప్పిందన్నావుగా?"

"మరి నాతో అలాగే అంది."

"ఉండు, నేను చూస్తాను" ప్రకాశం వంటింట్లోకి వెళ్ళాడు.

ఇందిర పళ్ళెం కడిగి బల్లమీద పెడుతోంది.

"ఇందాక ఒంట్లో బాగా లేదన్నావటగా?"

"అవును, అన్నాను."

"మరి ఇప్పుడు తిన్నావెందుకూ? పాలు తాగక పోయావా?"

"ఇప్పుడు బాగానే వుంది."

"ఇందిరా! ఏవిటా పెడసరం మాటలు? అర్థం పర్థంలేని మాటలు!"

"ఇప్పటికి వెతుకుతున్నారా అర్థాల కోసం? మీ ఇద్దరికీ అడ్డంరావటం ఇష్టంలేక ఇందాక అలా అన్నాను. మీరు సంతోషంగా కబుర్లాడుకుంటూ అన్నాలు తింటారు రోజూ. నేనెందుకూ మధ్య?"

ప్రకాశం ఆశ్చర్యంగా చూశాడు. ఇందిరకి చాలా కోపం వచ్చిందని అర్థమైంది. ప్రకాశానికీ కోపం వచ్చింది. "అసలు నువ్వనేదేమిటి?" అన్నాడు సూటిగా చూస్తూ.

"మిమ్మల్ని నేనేమీ అనలేదే! మీతో కలిసి అన్నం ఎందుకు తినలేదని అడిగితే నా అభిప్రాయం చెప్పాను. ప్రతి సమస్యకీ ఏదో పరిష్కారం వుండి తీరాలి. అదే నేను ఇవ్వాల్టినించీ ఆచరణలో పెట్టదల్చుకున్నాను."

ప్రకాశం తెల్లబోయాడు "పరిష్కారమా? అసలు ఏం సమస్య వచ్చిపడిందిప్పుడు?"

"ఈ ఇంట్లో నాకు అయిష్టంగా ఎన్నో జరుగుతున్నాయి. జరగరానివి జరుగుతున్నాయి. అది సమస్య కాదా నాకు?"

"నీకు అయిష్టంగానా? జరగరానివా? ఎందుకిలా చిరాకు పడతావు? చెప్పేదేదో సరిగ్గా చెప్పరాదూ?"

"ఏం జరుగుతున్నాయో మీకూ తెలుసు, నాకూ తెలుసు. చిరాకుపడిపోతూ నా మాటలన్నీ వినమని మిమ్మల్ని నేను నిర్బంధించటం లేదు! మీదారిన మీరు వెళ్ళండి!"

"అన్నదేదో అనేసి నిర్బంధించటం లేదంటే సరిపోతుందా? నీ ఏడుపు నాకు తెలుసు. నేను లలితతో సరదాగా మాట్లాడతాననేగా ఈ గోలంతా? నన్నే అర్థం చేసుకోలేకపోయావంటే, నిన్నేమనుకోవాలి? నా చెల్లెలెంతో లలితా అంతే."

ఇందిర శరీరం అసహ్యంతో జలదరించింది. ఎంత ఘోరం! "చూడండీ, నన్ను వంచించండి, ఫర్వా లేదు. మిమ్మల్ని మీరు వంచించుకోవద్దు. ఆత్మ వంచన మహానీచం. చెల్లెలితో ప్రవర్తించినట్టే లలితతో తిరుగుతున్నానంటే చాలా దారుణం! పైటచెంగులు పట్టి లాగటం, బుగ్గలు గిల్లటం, కాయితం వుండలు విసరటం, నడుములమీద చేతులెయ్యటం, అవన్నీ మీరు సోదరభావంతోనే చేస్తున్నానంటే .... నమ్మటానికి నాకింకా పిచ్చెక్కలేదు. అది కూడా ఎక్కాక చెప్పరుగాని."

ప్రకాశం ఒక్కక్షణం మాట్లాడలేక పోయాడు.

ఇందిర చెప్పిన చేష్టలు ఎన్నోసార్లు ఇందిర చూసినప్పుడూ చూడనప్పుడూ కూడా చేశాడు తను. అయితే మాత్రం? "మరదలు కదాని ఏదో సరదాకి .... హాస్యానికి ...."

ఇందిరకి పట్టరాని కోపం వచ్చింది — "కాస్సేపు చెల్లెలూ, కాస్సేపు మరదలూ! జబ్బుపడ్డ భార్య దగ్గిర ఒక్క నిమిషం కూడా నిలబడడానికి మనసు లేదు. మరదలితో ఎడతెగని కబుర్లూ, ఛలోక్తులూ, నవ్వులూ, షికార్లూ, సినిమాలూ — ఇదంతా సరదాకే! ఉత్త సరదాకే! మీరు చెప్తున్నారు, నేను నమ్మాలి!"

ప్రకాశం ఆవేశంగా కళ్ళెర్రచేశాడు "ఇరవై నాలుగ్గంటలూ ముక్కుతూ మూలుగుతూ మంచం పట్టు

కుని పాకులాడుతూ గది వదలకుండా కూర్చుంటావు. ఆఫీసులో చచ్చి చచ్చి కాస్సేపలా ఏ సినిమాకో షికారుకో వెళ్ళటం కూడా తప్పేనా? అంత నమ్మలేని దానివి చెల్లెల్నెందుకు రమ్మన్నావు? ఆ పిల్ల రాకుండా వుంటే ఏ గోలా లేక పోయేదిగా?"

హఠాత్తుగా మాటలు ఆపేసి గదిలోకి పోదామని పించింది ఇందిరకి. హృదయం చచ్చిన మనుషులతో ఈ తర్కవితర్కాలెందుకూ? చెల్లెల్ని రమ్మంటే, ఆ పల్లితో ఈ మనిషి ప్రవర్తించవలసిన తీరు ఇదా? ఆవేశమంతా అణుచుకుని విరక్తిగా అంది — "నా వాళ్ళని నేను శంకించేటంత నీచానికి ఒడిగట్టలేక పోయాను. అలా అని, కళ్ళకు కన్పిస్తోన్న నిజాల్ని చూడ కుండా కళ్ళుమూసుకోటం కూడా నాకు చేతకావటం లేదు. ఇరవై నాలుగ్గంటలూ మూలుగుతూ పడు కుంటానా? ఒక్క నెల రోజులు అనారోగ్యంతో వున్నా నని మీకు సుఖశాంతులు దూరమయ్యాయా? వాటిని వెతుక్కోవాలనే బయటికి పరిగెత్తుతున్నారా?" ఇందిర కంఠం భారమైపోయింది. దుఃఖం దిగమింగుతూ అంది — "ఈ నెల్నాళ్ళ రోగం సంగతేగానీ, ఇన్ని సంవత్సరాల కాపరంలో ఏ రోజూ మీకు గుర్తు లేదు!"

"ఎందుకవన్నీ ఇప్పుడు? అసలు ఇప్పుడు నేనేం కాని పని చేశానని ఇంత నిలదీసి అడుగుతున్నావు?"

"మీరేం, చేసినా నేను అడగను. అడగకూడదు. మీరు ఏ కానిపనీ చెయ్యడంలేదు. అంతా చెయ్యవలి సిందే చేస్తున్నారు. మనసుని చంపేసుకుంటే, ఏదీ కానిపని అవదు. మీరు ఆఫీసులో కష్టపడి ఇంటికి రావటం ఇవ్వాళ నాకు కొత్తకాదు. నా దగ్గిర కూర్చుని మాటల్లో మునిగి పోయేవారు. గడిచిపోయిన రోజుల్ని నేను గుండెల్లో దాచుకున్నాను. ఈ నెల్నాళ్ళలోనూ ఒక్క పూటైనా ఒక్క పావు గంటైనా, నా దగ్గిర కూర్చుని మాట్లాడారా? ఏదీ, మీకు తీరికేదీ? రోగిష్ఠిదానితో ఈ మారుమూల గదిలో కూర్చునేంత ఓపికేదీ? ఒక్క రోజైనా బయటికి తీసుకువెళ్దామన్న ఆలోచన వచ్చిందా? ఏం, నేను చల్లగాలిలో తిరగలేనా? రిక్షాల్లో వెళ్ళి సినిమాలు చూడలేనా? కాళ్ళులేక కుంటిదాన్న య్యానా? రోగం వచ్చి నీరసంతో బాధపడుతున్నానని నన్ను మీరేం కనికరించారా? నా కష్టం పంచుకోవాలని మీరేం ప్రయత్నం చేశారు? ఈ నెల్నాళ్ళు మీ ప్రవర్తనతో నేనెంత కుమిలిపోతున్నానో మీకు తెలుసా? అసలీ ఇంట్లో ఇందిర అంటూ ఒక దౌర్భాగ్యురాలు వుందన్న సంగతి మీకు గుర్తుందా? నేనేం కానిపని చేశానని అడిగితే, నేనేం చెపుతాను? ...."

ప్రకాశం నోరు విప్పి మాట్లాడలేక .... వూరుకోలేక .... విసురుగా తల విదిలించాడు. అవును, తెలివి తక్కువే. ఒక్కసారైనా ఇందిర కూడా బైటికి వస్తుం దేమో అడగలేదు. రమ్మని పిల్చి తీసికెళ్ళలేదు. ఇంట్లో ఒక్కతే ఎలా వుండగలదని ఆలోచించలేదు. కానీ .... కానీ — నిజంగా ఇందిరంటే తనకేం ద్వేషంకాదే! అయిష్టం కాదే!

"ఇదంతా నా బాధకొద్దీ నేను అడిగాను. పోని వ్వండి. ఏడ్చీ మొత్తుకునీ అనురాగాలు సంపాదించ లేం. ఇన్నేళ్ళూ అబద్ధపు ఆనందంతో గడిపాం. మిమ్మల్ని నేనేమీ సుఖపెట్టలేకపోయాను. మీ మనసులో మంచి జ్ఞాపకాలు మిగల్చలేకపోయాను. సుఖసంతోషాల కోసం మీరు ఇంకోచోట వెతుక్కునే పరిస్థితి తెచ్చిపెట్టాను. ఇక, మన సంసారం ఎలా నిలుస్తుంది? ఇది, ఇవ్వాళ కాకపోతే రేపైనా కూల వలిసిందే. ఒక దాంపత్యం నిలబడాలంటే, ఇద్దరి మనసుల్లోనూ అనురాగం వుండాలి. అది ఎండిపోతే, ఆ కళేబరాలు జీవచ్ఛవాలే. మనసు గాఢంగా కోరు కునే వాళ్ళతోనే జీవితం ముడిపెట్టుకోవాలి. ఒకసారి పెళ్ళయిందికదా అని, అందులోనే కూరుకుపోయి వుండనక్కరలేదు. నాతో ఈ దరిద్రగొట్టు సంసారం ఇంక మీకు వొద్దు. లలితని పెళ్ళిచేసుకునే ఏర్పాట్లేవో తొందరగా చేసుకుని ఈ నరకంలోంచి బయట పడండి! నేను మీకు అడ్డురాను."

"ఇందిరా! నీకేం పిచ్చెక్కిందా?" వెర్రివాడిలా అరి చాడు ప్రకాశం.

"నాకు పిచ్చెంక్కిందని మీరంటే సరిపోతుందా?"

"లేకపోతే నేను లలితని పెళ్ళిచేసుకోడం ఏమిటి? నువ్వు చచ్చిపోయావనా?"

ఇందిర నీరసంగా నవ్వింది — "మనసులు వుంటే, మనుషులు చచ్చిపోయినా వివాహ బంధం చెక్కు చెదరదు. మనసులే చచ్చిపోతే, మనుషులు వున్నా అది నిలబడదు. నేను చచ్చిపోయానో, మీ

మనసే చచ్చిపోయిందో అర్థం చేసుకుంటే మీకే తెలుస్తుంది.''

''ఇందిరా! ఎందుకిదంతా? లలితతో .... కొంచెం అతిగా ప్రవర్తించానేమో, కాదనను. కానీ ....'' మాట్లాడలేకపోయాడు, ప్రకాశం. ఇందిరకి ఇలా సంజాయిషీ చెప్పుకునే పరిస్థితి తెచ్చి పెట్టుకోడం ఎంత మూర్ఖత్వం! ఇందిరని ఇష్టంతోనే పెళ్ళి చేసుకున్నాడు. ఇందిర తననెంత ప్రేమించిందో, ఎంత సంతోషపెట్టిందో, ఎన్ని సేవలు చేసిందో, ఒక్క నెల్లాళ్ళ భాగ్యానికే మర్చిపోయేటంత నీచుడయ్యాడేం తను?

''ఇందిరా! నా మాట నమ్ము! నీ గురించి నేనెప్పుడూ అన్యాయంగా ఆలోచించలేదు. ఏదో తెలివి తక్కువగా చేశానని ఇంత బాధపడటం ధర్మంగా వుందా నీకు?''

ఇందిర అసంతృప్తిగా అంది — ''నేను మాటల కన్నా చేతలకే విలువ ఇస్తాను. నేనేం చెయ్యాలనుకున్నానో అదే చెపుతున్నాను. మీరేం చేసినా నాకిష్టమేనని కాయితం మీద రాసి ఇస్తాను. అంతే. ఇక నేనేం చెప్పలేను .... నా తల తిరుగుతోంది .... నించోలేను'' కళ్ళల్లో నీళ్ళు కళ్ళలో అణుచుకుంటూ బరువుగా అడుగులు వేస్తూ .... తడబడుతూ .... గదిలోకి వెళ్ళిపోయింది ఇందిర.

మధ్య గదిలో కొయ్యబారి నించునివున్న లలితని చూసి కూడా అంగలు వేసుకుంటూ వీధిలో కెళ్ళిపోయాడు ప్రకాశం.

★ ★ ★

మర్నాడు బాగా చీకటితో లేచిపోయింది లలిత. తన గుడ్డలన్నీ వుండలు చుట్టి పెట్లో కుక్కేసింది. మొహం కడుక్కుని తల దువ్వుకుంది. వంటింటికేసి తొంగి చూడకుండా వసారాలో కూర్చుంది.

ఇందిర కాఫీగ్లాసు తీసుకు వచ్చి చెల్లెలి ముందు పెట్టింది.

లలిత ఎటో చూస్తున్నట్టు మొహం తిప్పుకుని ''ఇవ్వాళ నేను వెళ్ళిపోదామనుకుంటున్నాను'' అంది పొడిపొడిగా.

ఇందిర ఆశ్చర్యపడింది — ''అదేమిటి? నువ్వు వెళ్ళటం ఏమిటి? నేనే వెళ్ళి పోదామనుకుంటున్నాను. వెళ్ళవలసింది నువ్వు కాదు, నేనూ, నా పిల్లలూ!''

పిచ్చిదానిలా చూసింది లలిత.

''నిజమే లలితా! గాఢంగా 'ప్రేమించు కుంటోన్న' వాళ్ళని విడదియ్యడానికి నేనేం రాక్షసినా? నువ్వు మీ బావని పెళ్ళి చేసుకుంటావో, ఏం చేసుకుంటావో అదంతా నాకెందుకుగానీ, అది నువ్వే ఆలోచించుకోగలవు. బావ పిల్లలులేకుండా చేయించుకున్నారని నీకూ తెలుసు. చూలెంతా, బాలెంతో అయ్యే చికాకులేవీ నీకుండవు. అందం చెడదు, యవ్వనం సడలదు. రోగం, రొష్టూ రావు. ఆనందంగా బతకడానికి అంతకన్న ఏం కావాలి? మీరిద్దరూ ఆడుతూ పాడుతూ కలిసీ మెలిసీ యుగాలు క్షణాల్లా గడిపెయ్యగలరు. ఈ మాట రాత్రే మీ బావకి చెప్పేశాను. ఈ క్షణం నించి ఈ ఇల్లు నీదే! నేనే మధ్యాన్నం పిల్లలతో వెళ్ళిపోతాను .... కొన్నాళ్ళు అమ్మ దగ్గిరే వుండి, తర్వాత ఏదో ఒకదారి చూసుకుంటాను.''

లలిత చెంపల మీద నుంచి కన్నీళ్ళు బొట్లు బొట్లుగా జారి పడుతున్నాయి. తల దించుకుని కూర్చుంది.

ఇందిర, చెల్లెలి దగ్గిరికి వెళ్ళింది — ''ఇలా చూడు లలితా! ఎందుకేడుస్తావు? ఇలాంటి పరిస్థితుల్లో కూడా మనం మనస్సులు విప్పి మాట్లాడుకోకపోతే ఎలా? ప్రేమల్ని గుండెల్లో పెట్టుకుని దాచుకోడం ఎందుకూ? బాధపడడం ఎందుకూ?''

''నేనేం బాధపడడం లేదు'' విసురుగా అంది లలిత.

''లేదంటే నేను నమ్ముతానా? నీ ప్రవర్తన నాకు తెలియటంలేదా? నువ్వా కథ విషయంలో వాదించినప్పుడు నీ అభిప్రాయం కూడా నాకు తెలిసిపోయింది. అంతవరకూ నా మొగుడు చేస్తోన్న పిచ్చి పనులకే నేను బాధ పడ్డానుగానీ నిన్ను శంకించలేదు. కాని .... నువ్వే అన్నావుగా? సావిత్రి చచ్చిపోయి నళిని వేణుగోపాల్‌ని పెళ్ళి చేసుకుంటే బాగుంటుందనీ .... రేపు నీ గురించైనా, నా గురించైనా అలాగే ఆలోచిస్తావుగా? నేను చచ్చిపోడం ఎందుకు లలితా? నాకు ఇద్దరు పిల్లలున్నారు. తల్లిపోతే వాళ్ళు దిక్కులేని వాళ్ళైపోతారు. పిల్లల్ని పెంచి పెద్దచెయ్యకుండా తల్లి చచ్చిపోకూడదు.''

"అది కథగదా అని అలా అన్నానుగానీ ...." నీ గురించి అన్నానా?"

"ఆ కథలో సావిత్రికి కూడా పిల్లలు వున్నారుగా? ఆ పిల్లల్ని వదిలి సావిత్రి చచ్చిపోవాలా?"

"................................"

"కథలు ఎక్కణ్ణించి వస్తాయి? జీవితాల్లోంచే కదా? నాకే కథలు రాయడం చేతనైతే ఇదంతా రాస్తే, ఇదే 'కథ' అయిపోదా? .... సరేలే. కథల సంగతి కాదు. నీ సంగతి చెప్పు. నువ్వు వెళ్ళడం కాదు. నేనే వెళ్తాను. మీ ప్రేయసీ ప్రియులిద్దరూ చిలకా గోరింకల్లాగ సుఖంగా వుండండి! మిమ్మల్ని విడదీసి నేను పాపం కట్టుకుంటానా?"

లలిత రోషంగా చూసింది — "బావ కదా అని కొంచెం సరదాగా వున్నాను. అంత మాత్రాన ఒకసారి పెళ్ళయిన వాణ్ణి నేను పెళ్ళిచేసుకుంటానా?"

"ఆయన పెళ్ళయిన వాడని నీకు బాగానే జ్ఞాపకం వుందే? మరి పెళ్ళయిన వాడికోసం అంతంత ముస్తాబులెందుకు చేసుకున్నావు? పెళ్ళయిన వాడి కళ్ళముందు రంభలాగా మెరవాలని అన్ని పాట్లెందుకు పడ్డావు? పైటచెంగులు లాగినా వూరుకున్నావు, బుగ్గలు గిల్లినా వూరుకున్నావు. వాలుజడలు పట్టుకున్నా వూరుకున్నావు. నడుములు తడిమినా ఊరుకున్నాను. అవన్నీ బావా మరదళ్ళ సరసాలేనా? లలితా! నేనేం చిన్నపిల్లనా? ఎన్నాళ్ళు మభ్యపెడతారు మీరిద్దరూ నన్ను?

తప్పేమీ లేదులే. నీకు ఆయన మీదా, ఆయనకి నీ మీదా అంత గాఢమైన ప్రేమలు కలుగుతున్నాయేమో! నేను అడ్డురాను సుమా! చెప్పాలంటే, రేపు ఆయన ప్రేమ ఇంకో పడుచు సుందరాంగి మీదకి మారితే, అప్పుడు నువ్వూ అడ్డురాకూడదు. బహుశా నువ్వా ఇబ్బంది రానివ్వవులే .... నేనంటే తెలివి తక్కువ దాన్ని. భర్తని ఎలాగ ఆకర్షించుకోవాలో తెలీనిదాన్ని."

లలిత ఏడుపు మొహం పెట్టి వొణుకుతూ నించుంది — "నేనంత చెడ్డ దాన్ని కాదక్కయ్యా!"

"చెడ్డదానివని నేనన్నానా? బావ మీద నీకు ప్రేమ కలిగితే అందులో చెడ్డేముంది? మీరిద్దరూ ఒకరితో ఒకరు సుఖంగా వుండాలనే నేనంటున్నాను కదా?"

"ఛీ! నేను బావతో ఉండడం ఏంటి? నేనసలు రమేష్‌ని పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను, తెలుసా?"

"అలాగా? అలాంటి దానివి, ఈ మగవాడితో అంత రాసుకుంటూ పూసుకుంటూ ఎలా తిరిగావు? ఈ మనిషి నీ నడుం మీద చెయ్యేస్తే ఎలా భరించావు? పాపం ఆ రమేష్‌ని అన్యాయం చెయ్యడం ఎందుకు లలితా? ఇంకో అబ్బాయిని పెళ్ళి చేసుకోవాలనుకుంటూ కూడా ఈయనతో ఇలాంటి వేషాలేశావంటే, .... ఇప్పుడు నిజంగానే అంటాను, నువ్వు చెడ్డదానివని. మంచి వాళ్ళయితే, ఇంత వెకిలిగా ప్రవర్తిస్తారా?"

లలిత ఏడవడం మొదలుపెట్టింది. కన్నీళ్ళతో చెంపలు తడిసిపోతున్నాయి "తప్పయిందక్కయ్యా! నేనసలు .... అవును .... నేనలా బావతో తిరగకూడదు .... ఒక్క రిక్షలో కూర్చున్నాం .... అవును, అలా కూర్చో కూడదు ...."

"అలా అనకు, నీ ప్రేమ రమేష్ మీద నించి ఈయన మీదకి మారిందేమో! అది ఆలోచించుకో! లేకపోతే నువ్వు మాత్రం ఎందుకలా చేస్తావు?"

"బుద్ధి లేక చేశాను. అంతకన్నా ఏం చెప్పను? నిజంగా నేను చెడ్డదాన్నే. లేకపోతే ఇంత బుద్ధిలేకుండా ఎందుకు చేస్తాను? నువ్వు జబ్బుతో వుంటే నీతో మాట్లాడుతూ ఇంట్లో వుండాలిగానీ, ఆయన్తో తిరగడం ఏమిటి?"

"పోనీలే, ఇదీ మంచిదే. నా మీద నా మొగుడికి ఎంత ప్రేమవుందో నాకూ తెలిసింది, రమేష్ మీద నీకు ఎంత ప్రేమ వుందో నీకూ తెలిసింది. అక్కయ్య ఇంటికెళ్తే ఇలా అయిందని ఎప్పుడూ జ్ఞాపకం పెట్టుకో. అనుభవాలు ఎప్పుడూ మర్చిపోకూడదు."

లలిత మాట్లాడలేదు. ఇందిర మాట్లాడించలేదు.

కాఫీ గ్లాసు అలాగే పడి వుంది.

"ఇవ్వాళ వీక్లీ వచ్చిందమ్మా!" కిటికీలోంచి పిల్చాడు పేపరు కుర్రాడు.

"అక్కడ పడేయ్" అంది ఇందిర వంటింట్లోకి పోతూ.

లలిత విని వూరుకుంది. కదల్లేదు.

[1966 'యువ' మాసపత్రికలో] ★